# భాగవతకథాసుధ

రచన

డా॥ కావూరి పాపయ్యశాస్త్రి

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2015**

**BHAGAVATHA KATHASUDHA**

**By**
**Kavuri Papaiah Sastry**

T.T.D. Religious Publications Series No. 1188
© All Rights Reserved

*First Edition :* 2015

*Copies :* 1000

*Published by :*
**Dr. D. Samba Siva Rao**, I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Office of the Editor-in-Chief
T.T.D., Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

పద్య గద్య దండకాది ఛందః ప్రక్రియల్లో గేయం ఒకటి. 'పాఠ్యే గేయే చ మధురమ్' అన్నట్లు గేయం చదువుటకు వినుటకూ మాత్రమే కాక, సంగీతం తోడైతే శ్రవణపేయం గానూ ఉంటుంది. కర్ణామృతమైన గేయఫణితిలో కథా రచనలు, అందులోను భాగవత కథా రచనలు గేయ మార్గంలో సాగితే పాఠకుల్ని హాయిగా అలరిస్తాయన్నది నిస్సంశయం.

పద్యాలకు వలెనే గేయానికి ఛందస్సు ఉంటుంది. ఇది మాత్రా ఛందస్సులో నడుస్తుంది. త్రిస్రం, చతురస్రం, ఖండగతి, మిశ్రం అని మాత్రా ఛందస్సు ప్రధానంగా నాలుగు రకాలుగా విభక్తమై ఉంది. త్రిస్ర ఛందస్సులో నడిచిన గేయకావ్యం ఈ 'భాగవతకథాసుధ', డా॥ కావూరి పాపయ్య శాస్త్రి గారు ఈ రచన చేశారు. నాలుగు పాదాలతో ఒక్కొక్క పాదం పన్నెండు మాత్రలుగా, మూడు మాత్రలు ఒక్కొక్క విభాగంగా త్రిస్రం నడుస్తుంది.

భాగవతంలోని సుప్రసిద్ధమైన ఘట్టాలు పదింటి నెన్నుకొని సామాన్య పఠితలకు సైతం అందుబాటులో సులభశైలిలో, సరళ గ్రాంథికంలో ఈ రచన చేశారు. భాగవతంలోని కథాఘట్టాలు ఏ రూపంలో ప్రచారం పొందినా అవి మారుమూల ప్రాంతాలకు వెళ్లి ప్రజల జీవనసరళి ధర్మావలంబనంగా సాగాలన్నదే మా ధ్యేయం.

డా॥ కావూరి పాపయ్య శాస్త్రిగారి ఈ 'భాగవతకథాసుధ' పాఠకుల్ని రంజింపజేస్తుందని ఆశిస్తూ, ఈ రచన ద్వారా పాఠకులు ప్రయోజనం పొందగలరని విశ్వసిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో...

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి





# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | ప్రహ్లాద చరిత్రము | 1-20 |
| 2. | గజేంద్రమోక్షణము | 21-31 |
| 3. | క్షీరసాగరమథనము | 32-47 |
| 4. | వామనావతార కథ | 48-56 |
| 5. | శ్రీకృష్ణజననము | 57-64 |
| 6. | శ్రీకృష్ణలీలలు | 65-82 |
| 7. | రుక్మిణీ కళ్యాణము | 83-93 |
| 8. | కుచేలోపాఖ్యానము | 94-102 |
| 9. | నరకాసుర వధ | 103-109 |
| 10. | అంబరీషుని కథ | 110-118 |



# 1. ప్రహ్లాద చరిత్రము

శ్రీ వికుంత పురమునందు
శ్రీహరి మందిరము ముందు
జయ విజయులు అను ఇరువురు
ద్వారపాలకులు నుందురు

సనకసనందులు ఒకపరి
సరసిజాక్షు జూడనేగ
వారించిరి ద్వారము కడ
వారిని జయ విజయులు

తమోగుణ స్వభావులై
తమనాపిన జయవిజయుల
తపోధనులు శపియించిరి
దానవులుగ పుట్టుడంచు

జయవిజయులు తప్పు తెలిసి
సాగిలపడి మొరలువెట్ట
హరి వైరము కలిగి మూడు
అసుర జన్మలెత్తవలయు

అటుపిమ్మట యథారీతి
హరి సాన్నిధ్యము కలిగెదు
నంచు శాపమును కుదించి
రాములు అనుగ్రహించి

జయవిజయులు శాపముచే
జన్మించిరి హిరణ్యాక్ష
హిరణ్యకశిపులనంగను
హరికి పరమ వైరులగుచు

తన తమ్ముని చంపినట్టి
దనుజవైరి శ్రీహరిపై
కక్షగట్టి దాడి చేసె
కనక కశిపుడాగ్రహమున

సకల లోకములయందున
సరసిజాక్షు గాంచలేక
విరోధమ్ము పూనియుండె
సురారి శ్రీహరియందున

ఆపైన హిరణ్యకశిపు
డజరామర శక్తులకై
పరమేష్ఠిని ధ్యానించుచు
చిరకాలము తపము చేసె

అసురవరుని తపము మెచ్చి
అజుడు కనికరమున వచ్చి
కోరుకొనిన వరములిచ్చి
పోయె హంస రథము నెక్కి

వరబల గర్వితుడు దనుజ
వరుడగు హిరణ్యకశిపుడు
లోకమ్ముల నెల్ల మిగుల
చీకాకుల పెట్ట సాగె



హరి వైరముతో నతండు
హరి భక్తుల హింసించుచు
మునులను బాధించు చుండె
సురలను పీడించు చుండె

హిరణ్యకశిపుని హింసకు
వెరచినట్టి మునులమరులు
విష్ణుదేవు వద్దకేగి
విన్నపమ్ము చేసుకొనిరి!

హరి వారలనోదారిచి
అభయమిచ్చి వీడుకొలిపె
హరి వైరము దనుజునందు
అంతకంత కతిశయించె

కాలక్రమమునహిరణ్య
కశిపునకొక సుతుడు కలిగె
ఆ బాల్యముగ నతండు
అమలిన శీలమున వెలిగె

అతని పేరు ప్రహ్లోదుడు
అతడు లలిత మర్యాదుడు
ఆతని గుణముల నెన్నగ
అహిపతికి నసాధ్యమయ్యె!

భూత దయాపరుడతండు
భృత్యుడు పెద్దల ముంగిట
సములకతడు సోదరుండు
ఆర్తులకాశ్రయమాతడు

గురువుల దైవముల భంగి
గౌరవించు చుండెనెపుడు
మానినులందరను గూడ
మాతృమూర్తులుగ జూచును

హాస్యమ్మునకైన కల్ల
లాడి ఎరుగడా బాలుడు
అతడు సద్గుణముల రాశి
అతడు వినయ సుధారాశి

అన్నిటి కన్నను ముఖ్యము
ఆజన్మమ్ముగ నతండు
హరి నామము జపియించుచు
హరిభక్తుండైవరలెను

హిరణ్యకశిపుండెంతటి
హరి ద్వేషియై యుండెనొ
ప్రహ్లాద కుమారుడంత
పరమ భక్తుడయ్యె హరికి

పానీయంబుల ద్రావుచు
పాహి శ్రీహరీయనును
ఆహారము దినునప్పుడు
హరి నామ స్మరణచేయు

నవ్వుచు నడచుచు పలుకుచు
నారాయణ స్మరణచేయు
జాగ్రత్ స్వప్న సుషుప్తుల
చక్రధారినే స్మరించు



శ్రీహరి పదసరసిజముల
చిత్తమ్మున నిల్పుకొనుచు
హరినామ స్మరణములో
అసురసుతుడు జగము మరచె

హరి భక్తుండగుచు సుతుడు
అరి కీర్తన చేయుచుండ
దనుజనాథుడాగ్రహించి
తనయు సంస్కరింపనెంచి

అజ్ఞానమ్మున బాలుడు
హరిహరి యని పలవరించు
విజ్ఞానము సమకూడిన
విష్ణుభక్తి వీడునంచు

తనయుని దగ్గరకు పిలచి
దనుజ వరుడు పలికె నిట్లు
చదువున కలుగును జ్ఞానము
చదువొసంగు వివేకమ్ము
చదువు నేర్చి ఓ కుమార
సద్బుద్ధులు పొందుముర
అనుచు అనునయముగ పలికె
పిలిపించెను కులగురువుల
ప్రచండ చండామార్కుల
ప్రహ్లాదుని అప్పగించె

కులగురువులు ప్రహ్లాదుని
గురుకులముకు గొంపోయిరి
గురువులు నేర్పిన విద్యల
కుదురుగ నేర్చెను బాలుడు

ఆజన్మ జ్ఞానియైన
ఆ ప్రహ్లాదుని బుద్ధికి
ఆ విద్యల సారమెల్ల
అసత్యమ్ముగా తోచెను

తనయుని చదువుల గురించి
దనుజవరుడు తెలియగోరి
పిలిపించెను ప్రహ్లాదుని
కులగురువుల సహితమ్ముగ

ఆనందంబుప్పొంగగ
అ సురేంద్రుడు నందను గని
అంక పీఠమున నిడుకొని
అనియెనిట్లు ప్రేమమీర

నాయన! గురుకులమునందు
ఏయే విద్యలు నేర్చితి
చెవుల పండువగునట్లుగ
చెప్పుమురా ప్రియనందన!

తండ్రి మాటలాలకించి
తనయుండిట్లని పలికెను
అసురేంద్రా సంసారము
అగాధమౌ సాగరము
దానినుండి బైటపడెడు
దారి లేక శోకింతురు!
కరుణామయుడగు శ్రీహరి
స్మరణమ్మున సంసారము
తరియింపగ వచ్చునన్న
తత్త్వమెరుగలేరు జనులు!



పుత్రుడు ఐదేళ్ళ వాడు
చిత్రముగా మాట్లాడగ
దానవ నాథుడు నవ్వుచు
తానిట్లని పలికెనపుడు

ఇదియేమిటిరా తండ్రీ
ఇట్లు పలుకుచుంటివేమి
దానవ జాతికి శ్రీహరి
తరతరాలనుండి వైరి

విష్ణుస్తోత్రమ్ము చేయు
వెర్రి పట్టె నేల నీకు
హరియంచును గిరియంచును
అనకుమింక నా ముంగిట

అని పలికిన తండ్రినిగని
అనియెనిట్లు ప్రహ్లాదుడు
ఇనుమేగతి అయస్కాంత
మునకాకృష్టం బగుచుండునో
నామనమ్ము శ్రీకాంతుని
నామ రూపముల నిలచును

మకరందము గ్రోలకుండ
మధుపము జీవించగలదె
మందాకిని వదలి పోయి
మరాళమ్ము నిలువ గలదె

మావిచిగురు మేయకుండ
కోయిల గళమెత్త గలదె
చంద్రికలందున నెగురక
చకోరములు మనగలుగునె

శ్రీహరిని స్మరించకుండ
జీవింపగ లేను తండ్రి
హరిని వీడి నా చిత్తము
అన్యమెరుగ నేరదయ్య

అని ప్రహ్లాదుడు పలుకగ
అసురేంద్రుండాగ్రహింప
ప్రభూ ప్రభూ మన్నింపుము
ప్రహ్లాదుని చదివింతుము
అని పలుకుచు కులగురువులు
అసుర తనయు గొంపోయిరి

ప్రచండ చండామార్కులు
ప్రహ్లాదుని చదివించిరి
అఖిల నీతి శాస్త్రమ్ములు
సకల విశేష విద్యలు

చదువులన్ని ముగిసినంత
చక్కగ బుద్ధులు చెప్పి
దానవనాథుని ఎదుటకు
ప్రహ్లాదుని గొంపోయిరి

తనయుని గని దనుజవరుం
డనురాగము పొంగి పొరల
హృద్యముగా నీ నేర్చిన
పద్యమొకటి చెప్పుము సుత
అని కోరగ ప్రహ్లాదుం
డనియెనిట్లు తన తండ్రికి –



ననుగురువులు చదివించిరి
ఘనమగు శాస్త్రముల నెన్నొ
సకల విద్యలందునున్న
సారమెల్ల తెలిసికొంటి

హరియే సకలము సర్వము
హరియే నిత్యము సత్యము
హరియే సర్వవ్యాపకు
డన్న దొక్కటే నిక్కము

విష్ణు భక్తి లేని బ్రతుకు
వ్యర్థము వ్యర్థము వ్యర్థము
శ్రీనాథుని కొలువనట్టి
జీవితమ్ము వృథా వృథా!

కమలాక్షుని సేవించెడు
కరమ్ములే కరమ్ములు!
నారాయణ స్మరణ చేయు
నాలుకయే నాలుకయగు!

కమలానాథుని కాంచెడు
కన్నులనే కనులనదగు!
శ్రీహరి పదములకు మ్రొక్కు
శిరము ధన్యమైన శిరము!

విష్ణుదేవుగాథలు విను
వీనులు మాత్రమే వీనులు!
మధుసూదను మనన చేయు
మనమునె మనమనదగును!

పరమపురుషు చేరగలుగు
పాదములే పాదమ్ములు!
పురుషోత్తము మీద నిలచు
బుద్ధి మాత్రమే బుద్ధి!

దేవ దేవు చింతించెడు
దినమే సుదినమ్మనదగు!
చక్రధారి గూర్చి చెప్పు
చదువే నిజమైన చదువు!

హరి మాహాత్మ్యమ్ము తెలుపు
గురుడే అసలైన గురువు!
పుండరీకనయను జూపు
తండ్రియె నిజమగు తండ్రి!

కమలాక్షుని సేవించని
కాయంబొక గాలిబొమ్మ!
హరి పూజలు చేయనట్టి
హస్తంబెండిన కొమ్మ!

కమలేశుని కీర్తించని
కంఠంబొక కంచుఢక్క
వెన్నుని దర్శించనట్టి
కన్నులు చీకటి గుహలు

చక్రహస్తు కీర్తించని
జన్మంబొక జన్మయగునె
విష్ణు భక్తి లేని వాడు
వింత జంతువే కనంగ



హరి మాహాత్మ్యమును గూర్చి
పరమ పరవశమ్ము గలిగి
ప్రహ్లాదుండాగకుండ
ఆహ్లాదముగా పలుకగ

కుమారు వర్తనముకెల్ల
గురుబోధలె కారణమని
ఆగ్రహమున అసురేంద్రుడు
నిగ్రహమ్ము కోలుపోయి
ప్రచండ చండామార్కుల
పలువిధముల నిందించెను

ఆచార్యులు ప్రహ్లాదుని
అసలు తీరు విప్పిచెప్పి
తమ తప్పేమియు లేదని
దనుజేంద్రునితో పలికిరి

ఆచార్యులమాటలు విని
అసురేంద్రుడు పుత్రునిగని
విష్ణు భక్తి నీ రీతిగ
వేరెవ్వరు చెప్పినారు
వారెవ్వరు చెప్పుమని కు
మారుని గద్దించి అడిగె

ఆ మాటల కసురసుతుడు
మోమాటము లేకుండగ
మందహాసమొలుకగ – న
మందగతిని పలికెనిట్లు

సంసారపు చీకటిలో
సమసిపోవు జీవులకు
శ్రీపతినెరిగెడు మార్గం
బేగతి లభియించు తండ్రి!

గుడ్డివాని ననుసరించు
గుడ్డివాని చందమ్మున
కర్మబద్ధులైన వారు
కానలేరు శ్రీనాథుని!

కరివరదుని కరుణగలుగ
కర్మ బంధములు వీడగ
కమలానాథుని కనుగొని
కైవల్యము నందగలరు

వేయి మాటలేలనయ్య
విష్ణు సేవయే నిత్యము
విష్ణు స్మరణమె సత్యము
విష్ణువె సర్వము సకలము

అని వక్కాణించి పలుకు
తనయునిగని దనుజ విభుడు
తొడపైనున్నట్టి వాని
తోసివేసి నేలపైకి
చటుల క్రోధమ్ముతోడ
భటులను గని పలికెనిటుల

వ్రేలెడంతలేడు వీడు
ప్రేలుచున్నవాడెన్నో
విష్ణు కీర్తనము చేయుచు
పితృ నింద యొనరించుచు



ఉన్మాదముతోడ వీడు
ఊగిపోవుచున్నాడు
వీనిని గొంపోయి ఇపుడె
వేగమె వధియించిరండు

చెడిన శరీరాంగమ్మును
చికిత్సకుడు కోయునట్లు
ఈ కలుషాత్మునివధించి
నా కులమ్ము రక్షించెద

అని హిరణ్యకశిపుడమిత
ఆగ్రహమున ఆనతిడగ
క్రూరదనుజులాక్షణమ్మె
గొంపోయిరి ప్రహ్లాదుని

నిశాచరులు నిర్దయులై
కశా ఘాతముల మోదిరి
కరవాలమ్ముల పొడిచిరి
కర్కశముగ హింసించిరి

ఎంతగ దానవులు తనను
హింసించుచునున్న గాని
అమ్మాయనడబ్బాయన
డబ్బాలుడు ప్రహ్లాదుడు

దేవదేవ రమానాథ!
దీనశరణ్యా! శ్రీహరి!
పన్నగేంద్ర శయన! ఆ
పన్న పోష! చక్రధారి!
అనుచు మందహాసముతో
హరి సంకీర్తన చేయును

ఎంతగ హింసించినను
సుంతైనను భయమందని
ప్రహ్లాదుని గని భయపడి
భటువులు ప్రభువుకు తెలిపిరి!

ప్రహ్లాదుని వైనము విని
భయ సందేహములు కలిగె
దానవేంద్ర హృదయుకది
దావానలమే యయ్యెను

పట్టిని తుద ముట్టించగ
పట్టుబట్టి దనుజేంద్రుడు
రెట్టింపగు క్రోధముతో
చెట్టల నెన్నో చేసెను

పాములతో కరిపించెను
పడదోయించెను లోయల
జలధులందు వేయించెను
జ్వాలలతో కాల్పించెను
గదలతోడ మోదించెను
గరళమ్మును త్రావించెను

అన్నియు వ్యర్థము కాగా
అసురేంద్రుని భయము హెచ్చె
ప్రహ్లాదుని వలనె తనకు
ప్రాపించును మరణమ్మని
నిశ్చయమ్ము కలిగినంత
నీరసపడె అసురేంద్రుడు



చింతించెడు దానవేంద్రు
సాంత్వన పరిచిన గరువులు
గురుకులమ్మునకు మరల
గొంపోయిరి ప్రహ్లాదుని

ఆచార్యుల ప్రబోధములు
అరణ్య రోదనము కాగ
అసురతనయు గొనితెచ్చి
హిరణ్యకశిపున కొసగిరి

అచంచలమ్మగు భక్తిని
హరి స్మరణ గావించుచు
నిర్భయుడై నిశ్చలుడై
నిలిచినట్టి సుతుని గాంచి
పలికెను హిరణ్యకశిపుడు
ప్రళయకాల భీకరుడై

ఎవ్వడురా ఆ శ్రీహరి
ఎక్కడరా ఆ శ్రీహరి
ఆ కపటిని పరిమార్చగ
లోకములన్నియు వెతికితి
నాకు కానరాని వాడు
నీకే గతి కనిపించును
హరి ఎవరో చూపింపుము
హరింతునిప్పుడె వానిని
అని అరిచెడు అసురేంద్రుని
గని ప్రహ్లాదుండిట్లనె

విష్ణుమయమ్మీ విశ్వము
విశ్వేశ్వరుడా ప్రభుండు
అణువణువున కణ కణమున
అంతటనున్నాడాయన
నీటియందు గాలులందు
నింగియందు నేలయందు
అగ్నియందు అన్నింటను
హరిమయమ్ము ఈ జగమ్ము

సర్వవ్యాపకుడాహరి
సర్వమయుడు చక్రధారి
ఎక్కడ వెతికిన అక్కడ
అక్కమలాక్షుడు కలండు

అనుచునిశ్చయాత్మకుడై
అచంచలమ్ముగ పలుకగ
దనుజ విభుండాగ్రహముగ
తన ఎదురుగనున్న సభా
స్తంభంబును చూపి, ఓరి
డింభక! ఈ స్తంభమున
ఉన్నాడా నీ శ్రీహరి
ఉన్న యెడల చూపింపుము

అని గర్జించెడు తండ్రికి
అనియెనిట్లు ప్రహ్లాదుడు
చీమ మొదలు బ్రహ్మ వరకు
శ్రీ మహావిష్ణు మయము



సందేహంబేలనయ్య
స్తంభమునందును గలండు
అని పలికెను ప్రహ్లాదుడు
అచంచలమ్మగు భక్తిని

హిరణ్యకశిపుండప్పుడు
దురాగ్రహావేశమ్మున
అరచేతను స్తంభంబును
చరచెను మహాబలమ్మున

స్తంభము నిలువున పగులగ
స్తంభము నుండి బయల్పడె
శ్రీ నరసింహాకృతిని బూని
శ్రీమన్నారాయణుండు

అగ్నిగుండముల విధాన
అక్షియుగము వెలుగుచుండ
దంష్ట్రోజ్వల ధగద్ధగలు
దశదిశలందున నిండగ

వార్షుకాభ్ర తటిల్లతల
వలె నఖములు మెరయుచుండ
కిరీట కుండల కంకణ
హారమరీచికల పర్వ

పర్వత కందరము వంటి
వదన గహ్వరమ్ము నుండి
ప్రచండ గర్జారవములు
ప్రళయ భీకరముగ వెడల

ఉల్కాపాతముల భంగి
ఉగ్ర దృక్కులలముచుండ
రక్త కాంతులొలయునట్టి
రసనాగ్రము వ్రేలాడగ

అరుణోజ్వల అధరమ్ములు
ఆవేశమ్మున అదరగ
సటాజాల కాంతులతో
సంధ్యా కాంతుల పర్వగ

భయంకరాకారముతో
ప్రళయ కాల వహ్ని పగిది
పన్నగేంద్రు పై దూకెడు
పక్షీంద్రుని చందమ్మున

హిరణ్యకశిపుని బట్టి
ఊరు యుగమ్మున నిలిపి
ఘోర నఖాయుధములతో
క్రూరమ్ముగ పొట్ట చీల్చి

అరుణ రక్త ధారలొలుక
ఆంత్రమాలికలు పెగల్చి
భీకర నరసింహమూర్తి
భీభత్సముగ చంపెను

ఆ దృశ్యము గాంచినట్టి
అసుర లెల్లభయమ్ముతో
ప్రాణములరచేత బట్టి
పలు దిశలకు పరువెత్తిరి



ఉగ్ర భీకరాకృతినిక
ఉప సంహృతి చేయుమంచు
నరసింహుని రిపురంహుని
హరి, అజ, అమరేంద్రాదులు
పలు విధముల స్తుతియించిరి
ఫలితమ్మది లేకపోయె

శ్రీనాథుని ఎదుట నిలచి
శ్రీదేవియు భక్తి తోడ
పలు రీతుల ప్రార్థించెను
ఫలితమ్మది లేకపోయె

ఆగ్రహమ్ము నశియించని
ఉగ్ర నారసింహమూర్తి
ప్రళయ భీకరాకృతితో
ప్రచండుడై విజృంభింప
భక్తవరుడు ప్రహ్లాదుడు
ప్రస్తుతులొనరించెనిటుల

శ్రీ కమలా మనోహరా!
శ్రీకర! కరుణాసాగర!
ఆది దేవ! అమర వినుత!
హరి! అనంత! అచ్యుత!
బృందారక బృంద వంద్య!
ఇందిరేశ! సుందరాస్య!
వనమాలాంచిత వక్షా!
పరమ పురుష! పంకజాక్ష!
శంఖచక్ర గదధరా! శరణాగత రక్షకా!

నీ మహిమ లెరుంగలేరు
నీరజ భవాదు లైనను
నిన్ను ప్రసన్నుని జేయగ
నేనెంతటి వాడనయ్య!

భీకర రూపమ్ము వీడి
శ్రీకరమగు నీ సుందర
రూపము కృపతో చూపుము
ఓ పరమ దయాకరా!

అని వినుతించెడు ప్రహ్లా
దుని కనుగొని కనికరమున
శ్రీ లక్ష్మీ నరసింహుడు
చేరదీసి తన చెంతకు

వాత్సల్యంబుగ ప్రేమగ
వరములనేకమ్ములిచ్చి
సకల మునులు సురగణములు
సన్నుతులొనరించుచుండ
శ్రీమన్నారాయణుండు
శ్రీ వికుంఠ పురము కరిగె

పరమ భక్తుడై వరలిన
ప్రహ్లాదుని గాథ ఇది!
పాపమ్ముల హరియించెడు
భాగవత కథామృతమిది!

* * *



# 2. గజేంద్ర మోక్షణము

వినగోరెద మునినాథా!
విష్ణు మహిమలనవరతము
కరుణతోడ వినిపింపుము
గజేంద్రమోక్షణ చరితము

పరమ భక్తి నీ రీతిని
పరీక్షితుండడిగినంత
ఆనందముగా శుకముని
ఆ కథ వినిపింపదొడగె

వినవయ్యా పరీక్షితుడ!
విష్ణు ధ్యాన దీక్షితుడా!
ఇది గజేంద్రమోక్షణ కథ
సదమల భాగవత సుధ!

కలదు త్రికూటంబనియెడు
ఇలలో నొక మహానగము
నానా విధ తరులతలతో
ఆనగ మతి దుర్గమము

ఉన్నవి ఆ వనమునందు
ఎన్నో యేన్గుల గుంపులు
కావవి మత్తేభమ్ములు
కదలే నగములగములు

ఎదురులేక బెదురు లేక
ఎల్లలెరుగ కేన్గులెల్ల
సంచరించు నా వనమున
సంకోచింపక మనమున

అహంకారమంతయు నొక
ఆకారము దాల్చినట్లు
ముదిరిన చీకట్లన్నియు
ముద్దకట్టె నన్నట్లుగ

ఆ కరి కరేణు తతికిని
అధినాయకుడొకడుండెను
అతని ఏలుబడిని కరులు
అతిశయమున కులగిరులు

బలదర్పములతిశయింప
బలగముతో నా గజపతి
బలాదూరు గావించును
బలారి వాహనము నైన

వేదండములన్నియు తన
వెంటరాగ నొక దినమున
వేడుకతో ఆ గజపతి
విహారమ్ము సలుపనేగె

అడవిలోన యథేచ్ఛగా
అలయు వరకు తిరిగి తిరిగి
దారితప్పి దప్పిక వడి
డస్సిపోయె గజనివహము



కరుల గుంపు నీటికొరకు
కానన మంతయు తిరుగగ
కనుపించెను కరులకపుడు
కడకునొక్క కాసారము

వికసించిన కలువలతో
బక మరాళ ఝషములతో
కాసారము చూపరులకు
కనువిందొనరించు చుండె

దంతియూథ మెల్ల మిగుల
సంతసించి నీరు ద్రావి
జలాశయమ్మున మునింగి
జలక్రీడ లాడ సాగె

శుండాలమ్ములు జలముల
తుండమ్ములతో పీలిచి
సయ్యాటగ పరస్పరము
చల్లుకొనుచు జలకమాడె

జలములతో పాటు కరులు
జలచరముల గూడ పీల్చి
నభము దిక్కుగా గట్టిగ
రభసమ్మున చిమ్మ సాగె

ఆ రీతిగ సరసిలోని
మీనమ్ములు మకరమ్ములు
నభమునందు సంచరించు
నక్ర మీనముల దాకెను

కరితతి సరసున కరమ్ము
కల్లోలము చేయుచుండ
మడుగున గల నొక మకరము
వడివడిగా పైకి వచ్చె

వచ్చిన ఆ జలగ్రహము
హెచ్చిన కోపమ్ము తోడ
మత్తేభము నొడిసిపట్టె
మార్తాండుని రాహువట్లు

నీటిలోన మకరమట్లు
నోటపట్టి కరి పాదము
ధాటిగ తన శక్తి కొలది
నీటిలోకి లాగదొడగె

ఆ గ్రాహము నోట చిక్కి
ఆగ్రహముగ గజనాథుడు
దాని పట్టు వదల్చుకొన
ధాటిగ యత్నించ సాగె

కరి మకరిని లాగుచుండ
మకరి కరిని లాగ దొడగె
కరి మకరుల పోరు ముదిరి
కరము భీకరమ్మాయెను

అవక్ర పరాక్రమమ్మున
ఆ నక్ర గజమ్ములట్లు
ఆహారము నిద్రమాని
ఆహవమొనరించసాగె



మకరి నోట చిక్కినట్టి
మగని స్థితికి దుఃఖించుచు
కరేణుతతి విభుని వీడి
కదల లేక నిలచిపోయె

జలమునందు నుండుకతన
జలగ్రాహ బలము హెచ్చె
దంతినాథు శక్తి యెల్ల
అంతకంతకును నశించె

పరిపరి విధముల మకరము
కరివిభు బాధించుచుండ
బహుళ పక్ష చంద్రుని వలె
పాపము – కరి క్షీణించెను

అలయక సొలయక నిలువక
అహోరాత్రులావిధముగ
వేదండము మకరితోడ
వేయి యేండ్లు పోరాడెను

నిక్కినీల్గు మకరి తోడ
పెక్కు వత్సరములు పోరి
దిక్కరి బోలెడు అక్కరి
చిక్కి శల్యమైపోయెను

తన బలమెల్ల నశించగ
తన ప్రాణము పోవుచుండ
ఆ గజపతి దిగులు చెంది
ఈ గతి దుఃఖించ దొడగె

ఏ గతి నే దీని గెలుతు
ఈ దుర్గతి ఎట్లు తొలగు
ఎవ్వరి నే వేడుకొందు
ఎవ్వరడ్డు పడగలరు!
ఇవ్వారిచరమ్ము జంపి
ఎవ్వరు నను రక్షింతురు!

మదము ముదిరి కాదె నేను
మదగజనివహమ్ము తోడ
ఈ నీరాకరమున డిగి
ఈ నక్రమునకు చిక్కితి

నన్నెవ్వరు రక్షింతురు!
నను బ్రోచెడు దొరలెవ్వరు!
ఈ దుర్గతి నుండి నన్ను
ఈశ్వరుడే రక్షించును

జగములెల్ల పోషించెడు
జగదీశుడె దిక్కు నాకు
లోకమ్ముల నేలునట్టి
లోకేశుడె నాకు దిక్కు

మ్రొక్కెద నా పరమాత్మకు
మ్రొక్కెద నా నిర్గుణునకు
మ్రొక్కెద నా జగత్పతికి
మ్రొక్కెద నా దయామతికి

ఆపన్నుల బ్రోచునట్టి
శ్రీపతి నే వేడుకొందు
దీనుల కాపాడునట్టి
శ్రీనాథుని ప్రార్థించెదు



తెలివి కలిగి ఈ రీతిగ
ఎలుంగెత్తి పిలిచెనపుడు
శ్రీ వికుంఠ పురవాసుని
శ్రీ మన్నారాయణుని

ఓ కమలామనోహరా!
ఓ కరుణాపయోనిధీ!
ఓ శరణాగత రక్షక!
ఓ హో! దీనశరణ్యా

నీవే నాకేదుగడవు
నీవే నా రక్షకుడవు
లావొక్కింతయు లేదిక
ఓ వరదా! దయామయా!

ధైర్యము నశియించిపోయె
తనువుడస్సె, మూర్ఛవచ్చె
ప్రాణమ్ములు పోవుచుండె
దీనావన! కావుము నను

భద్రాత్మా! రక్షింపుము
వరదా! నను కరుణింపుము
నీవు తప్ప దిక్కు లేరు
దేవా! నను కాపాడుము.

ఈ రీతిగ మాతంగము
దీనముగా వేడుకొనగ
కరుణామయుడగు శ్రీహరి
కరివిభు కాపాడనెంచె

శ్రీహరి ఆ సమయంబున
శ్రీ వైకుంఠపురంబున
మందారవనాంతరమున
ఇందిరతో కూడియుండె.

అమృత సరసి సమీపమున
చంద్రకాంత శిలావేది
సుమాల పర్యంకము పై
రమా వినోదియై యుండెను

ఆపన్నుల బ్రోచునట్టి
ఆ పన్నగ శాయి కపుడు
ఓ కమలా మనోహరా
ఓ కరుణాపయోనిధీ

ఓ శరణాగతరక్షక
ఓ దీనశరణ్యా – యను
వేదండము చేయు వినతి
వేగముగా వీనులబడె.

ఆర్తితోడ విలపించెడు
అగ్గజమును రక్షింపగ
దిగ్గున పర్యంకము దిగి
ఆత్రముగా బయలుదేరె

చెంతనున్న శ్రీదేవికి
చెప్పనైన చెప్పలేదు
శంఖచక్ర గదాదులను
చేతనైన బూనలేదు



వేత్రహస్తు బిలువలేదు
వినతాసుతు జీరలేదు
నెమ్మోమున వ్రాలుచున్న
ధమ్మిల్లము సరిచేయక

చేతనున్న శ్రీదేవీ
చేలాంచలమును వీడక
ఉన్నవాడు ఉన్నట్లుగ
హుటాహుటిన బయలుదేరె

పరుగెత్తెడుహరి వెంటనె
సిరియును పరువెత్తుచుండె
వారి వెనుక పక్షీంద్రుడు
నారదుండు సేనాపతి
ఆ పై పంచాయుధములు
అటుపై పురవాసులెల్ల
వైకుంఠపురంబంతయు
ఒక్కుమ్మడి బయలుదేరె

ఆ రీతిగ పరువులెత్తు
నారాయణు గాంచినట్టి
సుర కిన్నర కింపురుషులు
పరమ భక్తి మ్రొక్కులిడిరి

ఏ దీనుని గావనెంచి
శ్రీ దయితుండీ విధముగ
చెచ్చెర పరువెత్తునంచు
అచ్చెరువడి తిలకించిరి

తన పయ్యెద కూడ విడక
ఘన వేగమ్మున పరుగిడు
మనోహరుని వైనమునకు
మాధవి అచ్చెరువందెను

జలదముతో సాగునట్టి
శంపాలత చందమ్ముగ
జగన్మాత మాటాడక
జగన్నాథు వెంటజనియె

సరసిదరికి వచ్చినట్టి
కరుణాపయోధి శ్రీహరి
పరమభక్తి మొరలువెట్టు
కరివిభు దుస్థితి గాంచెను

గ్రాహ మస్తకమ్ము ద్రుంచి
గజేంద్రు రక్షించుటకై
చక్రధరుడు వేగమ్ముగ
చక్రమ్మును ప్రయోగించె

చక్రధార సోకినంత
నక్రము తల తెగిపడియెను
మకరి పట్టు విడిన యంత
మాతంగము సంతసించె

శ్రీమన్నారాయణుండు
చేయూత నొసంగినంత
సరసి నుండి మెలమెల్లన
కరివిభుండు వెలికి వచ్చి



శ్రీనాథుని పదముల తన
శీర్షముంచి మ్రొక్కులిడుచు
బ్రహ్మానందమ్ము తోడ
బహువిధముల సంస్తుతించె

కరుణాళుండగు శ్రీహరి
కరివిభుగాచిన కథ యిది
భక్తతతికి ముక్తినొసగు
భాగవత కథాసుధ యిది.

* * *



# 3. క్షీర సాగర మథనము

అమృతోత్పాదన కొరకై
ఆదిత్యులు దితితనయులు
క్షీర జలధి చిలికిన కథ
శ్రీ శుకముని తెలుపవయ్యా!

అని పరీక్షిత్తు మిగుల
వినయమెసగ ప్రార్థించగ
శుక మహర్షి ఆ సత్కథ
సకలము వినిపించెనిట్లు!

కలదు మున్ను ఒక తపస్వి
కశ్యప ప్రజాపతి యన
దితి అదితి అను అతివలు
దయితలిద్దరతనికి

అదితి కొడుకులాదిత్యులు
దితి కొడుకులు దైత్యులు
సతతము ఆ సోదరులకు
జరుగు చుండె కలహము

ఒక పరి సమరమునందున
ఓడి పోయి దేవగణము
దిక్కులేక అజుని జేరి
మ్రొక్కి యిట్లు పలికిరి

దేవదేవ కమల భవా
నీవె కదా మాకు దిక్కు
నాకము పై దాడి చేసి
నందనమును పాడు చేసి
రక్కసి మూకలు మమ్మిటు
చిక్కుల పాలొనరించిరి
ఓ పరమేష్ఠీ కృపతో
చూపుము మాకొక్కదారి

వారి మాటలాలకించి
వారందరననునయించి
అపుడిట్లనె ఆ విరించి
అసురులతో గళము పెంచి

సర్వ శక్తి సమన్వితుడు
సృష్టికర్త యనుచు వినమె
చీమ మొదలు శివుని వరకు
ఆ మహాత్ము ఆధీనమె!

నాకు మీకు లోకములకు
లోకేశుడె రక్షకుండు
ఆ అనంతు ఆదిపురుషు
నందరమును ప్రార్థింతము

కమలాసునుడట్లు పలికి
కమలాక్షును హృదిని నిలిపి
మధురమైన స్వరము తోడ
మధుసూదనుస్తుతి యొనర్ప
వేల్పులెల్ల కరము నెత్తి
వేధననుసరించిరి

ప్రవిమలమగు మనసులతో
బ్రహ్మాదులు సంస్తుతింప
సంతసించి ఆ శ్రీహరి
సందర్శనమొసగె నపుడు

శంఖచక్ర గదాధరుడు
సకల జగన్మనోహనుడు
వికచాంభోరుహ నేత్రుడు
వినీల సుందర గాత్రుడు
గంభీరమ్మగు గళమున
కరుణ కురియ పలికె నిటుల

ఓ విధాత! ఓ సురేశ!
ఓహోహో వేల్పులారా!
విచారమ్ము వలదు వినుడు
ఉపాయమ్ము కలదు ఒకటి

అసురలతో కలసి మీరు
అరమరికలు లేకుండగ
మందరగిరి కవ్వముగా
వాసుకి వాటారముగా
పాల కడలి చిలుక వలెను
సుధను మీరు పొందగలరు
వ్యధలు మీకు తొలగగలవు
నా సహాయమందజేతు
అనుచు పలికి ఆ శ్రీహరి
అంతర్హితుడయ్యెనపుడు



శ్రీనాథుని అభయముతో
ఆనాకాధీశుడటుల
విధి వ్రాతకు తలను వంచి
విరోధులను ఆశ్రయించె

సమయమరసి ఒక్కనాడు
సంకల్పము తెలియ పరచి
అమృతోత్పాదనను గూర్చి
అసురులనొప్పింప జేసె

అటు పిమ్మట ఐక్యమ్ముగ
ఆనందమ్ముప్పొంగగ
సురాసురులు హుషారుగ
సుధార్జనా చిత్తులైరి

ఆకసమును తాకుచున్న
దదే అదే మందరగిరి
దానిని తెచ్చుటకు దేవ
దానవులందరు నేగిరి

గునపమ్ములతో పెగల్చి
కొండనదుగునుండి ఎత్తి
క్షీరాబ్ధికి తెచ్చుటకై
శిరముల పైకెత్తుకొనిరి

గిరిబరువునకాగలేక
సురలసురులు మరణించగ
గిరిని కడలి దరికి చేర్చ
హరి గరుడునకానతిచ్చె

విష్ణునాజ్ఞ తలను దాల్చి
విహగేంద్రుండతి రయమున
గిరిని హరిని తెచ్చి దించె
క్షీరాంభోనిధి తటమున

అదుగో అతడే వాసుకి
అహికులమునకధిపతి
అతని జేరినతుల జేసి
అడిగిరి సుర రక్షోతతి

పన్నగేంద్ర వినవయ్యా
విన్నపంబు మాదొక్కటి
మందరగిరి కవ్వమునకు
మాకు వలయు తాడొక్కటి

మరువము నీ మేలెప్పుడు
కావలెనీ సాయమిపుడు
పాలకడలి చిలుకుటకై
పాశమీవు కావలయును

వారి మాటలాలకించి
వాసుకి అంగీకరించె
సాదరముగ తెచ్చిరతని
సాగర తీరమ్మునకు

చుట్టుకొనియె పామప్పుడు
గట్టు చుట్టునొక పెట్టున
గిరిని దించి కడలి లోన
చేరిరి చెరి ఒక వైపున
పట్టుకొనిరి సురలసురులు
పడగనొకరు తోకనొకరు



అంతలోనె అసురలందు
అలముకొనెను కలకలంబు
తలను సురలు పట్టనేల
తోక మాకు వదల నేల
నిశాచరులకిది నిజమ్ము
నిరాదరము అవమానము
అనుచు దనుజులాగ్రహమున
అలజడి కావించిరపుడు

ఘర్షణ వారింపనెంచి
శీర్షమ్మును వారికొసగి
పుచ్ఛము గైకొనిరి సురలు
వచ్చిన కలహము సమసెను

జలధిలోన మంధరగిరి
జరజర బరబర తిరుగగ
త్రచ్చ సాగె సురలసురులు
మెచ్చుకొనుచు ఒకరినొకరు

అమాంతముగ అంతలోనె
ఆ మహాద్రి మునుగ సాగె
అయ్యో ఇపుడేమిసేతు
మనుచు వారు వగవ సాగె

అనూహ్యమగు సంఘటనకు
అయోమయముగా నందరు
మునిగి పోవు గిరిని గనుచు
మునిగినారు దుఃఖ జలధి

శ్రీహరి శ్రీ కూర్మముగా
శీఘ్రమ్ముగ నవతరించె
వనధిలోన మునుగు గిరిని
తన మూపున హరి ధరించె

పరమాత్ముని లీలల గని
పరమానందమును పొంది
భక్తి పారవశ్యముతో
ప్రస్తుతించిరందరపుడు

కమలాక్షుడు కమఠముగా
కడలిలోన గిరిని మోయ
మరల మహోత్సాహముగా
మథనము ప్రారంభమాయె

కేకలు బొబ్బలు అరుపులు
కేరింతలు కేకిసలుగ
కల్లోలంబగునట్లుగ
కడలి చిలుకబడుచు నుండె

జరజర బరబర చరచర
చరచర బరబర జరజర
గిరగిర గిరి తిరుగు చుండ
తరచ బడుచునుండె కడలి

దిక్కులెల్ల పిక్కటిల్ల
దిగ్గజాలు దిగులు పడగ
భోనభోంతరాళములో
ప్రాణికోటి తత్తర పడ



భీషణరావమ్ములతో
బ్రహ్మాండము అదురునట్లు
గ్రహకాండము కదులునట్లు
కడలి తరచబడుచు నుండె

కోలాహలముగ అమృతము
కోరి జలధితరచుచుండ
హాలాహల విషము పుట్టె
అకస్మాత్తుగా నప్పుడు

బడబానల జ్వాలల వలె
ప్రళయానల కీలల వలె
పొగలు సెగలు అలుముకొనగ
పొంగుచుండె గరళ వహ్ని

క్షణక్షణము విషజ్వాలలు
అణువణువున పరచుకొనుచు
భువనమ్ముల మాడ్చునటుల
పొంగి నింగికెగయుచుండె

ఆ మహా విపత్తు గాంచి
ఆ నిలింప నిశాచరులు
పాలుపోక కేమిసేయ
పాలకడలి విడిచి పెట్టి
బ్రతుకు జీవుడా యనుకొని
పారిపోవ సాగిరపుడు

పారిపోవు సురాసురుల
వారిజాసనుండు పిలచి
కష్టమ్ములు వచ్చినపుడె
కావలె ధైర్యమ్ము మనకు

మనమందరమిపుడె పోయి
మహాశివుని ప్రార్థింతము
ఆ పరమేశ్వరుడె యిట్టి
ఆపద తొలగించ గలడు

వనజ భవుండటుల పలికి
దనుజ అమర మూకలతో
దనుజాసురసంఘములతో
కైలాసమ్మునకు నేగి
ఫాలాక్షుని ప్రార్థించెను

లోక శుభంకరా! హరా!
శోకతిమిర హరా! హరా!
దయామయా! శివంకరా!
భవా! శివా! మహేశ్వరా!

సుధను కోరి సురాసురులు
మధియించగ క్షీరాబ్ధిని
కాలకూట విషము పుట్టె
శూలధరా! ఆదుకొనుము

నీవు తక్క రక్షింపగ
నిజముగ దిక్కెవరు మాకు
కరుణాకర! గిరిజావర!
గరళమ్మును హరియింపుము

అనుచుఅజుడు సురలసురులు
తనను వేడుకొనగ హరుడు
చిరునగవులు చిందించుచు
గిరిజ మోము వైపు చూచె!



మ్రింగెదు వాడు విభుండని
మ్రింగెడునది గరళమనియు
మంగళ గౌరికి తెలిసియు
మ్రింగు మనెను – యేమి వింత!

స్వామి భావమెరిగి ఉమయు
ఆమోదము తెలియ పరచె
జగద్రక్షణా మతులగు
జననీ జనకులు యిరువురు!

భువన క్షేమమ్ము కోరి
భవుడు కడలి కడకు చేరి
పొంగుచున్న గరళమ్మును
మ్రింగివేసె నొక్కసారి!

చెరగవపుడు చిరు నగవులు
తరగవు జాబిలి వెలుగులు
ప్రపంచమును రక్షించెడు
ప్రశాంతి మోమున తొలగదు

అతడె జగతి సృష్టించెను
అతని లోన జగములుండె
అందు చేత గరళాగ్నిని
అణచి పెట్టె గళమునందు

గరళ వహ్నిచే కంఠము
కమిలి నల్లగానయ్యెను
నాటినుండి శితికంఠుడు
కంఠే కాలుండాయెను

మణి భూషలు లేకున్నను
మచ్చ ఒక్క తొడవయ్యెను
మహేశ్వరుని దయార్ద్రతకు
మచ్చ గుర్తుగా మిగిలెను

మునిగిపోవు భూ ధరమును
మోసెను మూపున మురహరి
పొంగి పొరలు గరళమ్మును
మ్రింగెను దయతో పురహరి

వచ్చిన ఆపదలన్నియు
వచ్చినట్లె తొలగిపోయె
దైవబలము కలుగ జయము
తథ్యము ప్రతి పని యందున

ఆపదలను అధిగమించి
అమృతమును పొందుటకై
పట్టువిడక సురలసురులు
పాలకడలి తరచ సాగె!

సాగుచుండ మథనమట్లు
జనియించెను జలధినుండి
కామధేనువొకటి – దాని
గ్రహియించిరి దేవ మునులు

ఉదధినుండి జనియించెను
ఉచ్చైశ్రవమను నశ్వము
అసురేంద్రుండద్దానిని
ఆనందముగా గైకొనె



పారావారమున బుట్టె
ఐరావతమను యేనుగు
ఇంద్రుండా ఇభరాజును
ఇష్టముగా స్వీకరించె

కడలి నుండి అటు పిమ్మట
కల్ప వృక్షముదయించెను
బృందారకులాతరువును
నందనమ్మునకు చేర్చిరి

మేనున మీగడ మిసమిస
మీనుల బోలిన కనులతో
ఆ రత్నాకరము నుండి
అప్సరసలు జన్మించిరి

సంద్రమ్మును చిలుకుచుండ
చంద్రుడుద్భవించె నపుడు
విరించి యోచించి అతని
వియన్మండలమున నిలిపె

సుధకు మున్ను జలధినుండి
శుభలక్షణములు గలిగిన
సుందరాంగి జనియించెను
చూపరులచ్చెరువొందగ

మంగళకారిణి యగు ఆ
అంగన శ్రీ మహాలక్ష్మి
ఆమెను తన యిల్లాలిగ
హరి గైకొనె హర్షమ్ముగ

శ్రీదేవిని చెట్టపట్టి
క్షీరజలధికల్లుడగుచు
శ్రీనాథుండై వరలెను
శ్రీమహావిష్ణువటుల

కౌస్తుభమును కానుకగా
కడలి రాజు అల్లునకిడె
సిరిని మణిని ఉరమునందు
ధరియించెను శ్రీ దయితుడు

నిలింపులును నిశాచరులు
నిలువకుండ నీర నిధిని
చిలుక చిలుక చివరికపుడు
ఫలియించెను ఆ యత్నము

దివిజ వైద్యుడవతరించె
దివ్యమైన తేజముతో
కరమునందు కలశముతో
కడలినుండి వెడలి వచ్చె

అతని గాంచి సురాసురులు
ఆనందము పట్టలేక
అమృతముఅమృతంబనుచును
అరువసాగిరందరును

వేల్పువెజ్జు చేతినుండి
వేగమ్ముగ దనుజులపుడు
సుధా భాండమందుకొనిరి
సురల మోసగించి చనిరి



మోసపోయి దేవగణము
మొరవెట్టిరి హరిని జేరి
వారందరనూరడించి
వాగ్దానము చేసెను హరి

చేతికినందినయమృతము
చేయి జారిపోయినదని
దిగులు వలదు సురలారా!
తెచ్చియిత్తు మరల మీకు

ఇచట సురలతో శ్రీహరి
ఇట్లు పలుకుచున్నపుడే
అచట అసుర గణమునందు
అంతఃకలహము పుట్టెను

ఒకని మించి మరియొక్కడు
ఒకని మోసగించి ఒకడు
అమృత కలశమందుకొనుచు
అటునిటు పరుగెత్తుచుండ

అంతలోనె అలనల్లన
అతివయోర్తు అచటికొచ్చె
వచ్చి దానవుల కనులకు
అమృతము పండించి పోసె

ఆమెను గని అసురలగమి
అమృతము మాటే మరచెను
ఆ విలాసిని చుట్టును
అందరాశగా మూగిరి

‘ఇందువదన’ అని ఒకడన
‘కుందరదన’ అని ఒకడన
‘మందగమన’ అని ఒకడన
‘సుందరాంగి’ అనె నొక్కడు

‘కంబుకంఠి’ యనగ ఒకడు
‘బింబాధర’ అనె ఒకడు
‘చిగురుబోడి’ అనుచుఒకడు
వగలాడివె అనుచు ఒకడు

ఆమె చుట్టు చేరినారు
అమృతము మాటే మరిచిరి
అమృతము మాట మరిచి వారు
ఆమె చుట్టు చేరినారు

కలహమేల అసురులార
కలశమేది అనుచు నామె
మంజులమగు కంఠముతో
మత్తులోన వారి ముంచె

త్రావకయే అమృతమ్మును
త్రావినంత పనియయ్యెను
ఆ కంఠము వినినంతనే
వైకుంఠము పొందినట్లు!

అసురులార తగవదేల
అమృతమ్మును పంచి యిత్తు
రండు రండు భాండమేది
రండు కూర్చొనుండందరు



అనుచు వారి మోహ పరచి
అతివ సుధా కలశమడుగ
మారు మాట చెప్పలేక
మధుభాండమునిడి రామెకు

జగన్నాథుడావిధముగ
జగన్మోహినిగ వెలసెను
ముష్కరులగు దానవులను
మోహమ్మును ముంచి వేసె

బారులుగా సురాసురుల
భామిని కూర్చుండ బెట్టి
అమృతమును మొత్తముగా
ఆదిత్యులకే పోసెను

ఆ రీతిగ సుధను గ్రోలి
అమరులైరి ఆదిత్యులు
అలవిగాని అతిశయమున
అంతమొందిరా దైత్యులు

శ్రీనాథుని దయ చేతను
సిద్ధించెను సురల కోర్కె
శ్రమకు తోడు దైవ బలము
సమకూరిన కానిదేమి!

ఇది అమృతోత్పాదన కథ
సదమల భాగవత సుధ
మునివరులు పరీక్షితునకు
వినిపించిన మధుర కథ!

* * *



# 4. వామనావతార కథ

శ్రీరమణుడు వామనునిగ
ధారణియందు జనించిన
ఘనమగు కథ వినగోరెద
మునిరాజా! వినిపింపుము!

అని అమలిన భక్తి తోడ
యడిగినంత పరీక్షితుడు
ఘనమగు వామనచరితము
వినిపించెను శుకుడిట్టుల

అసురాధీశుండగు బలి
అమరులపై దాడి చేసి
సురాధిపుండగు ఇంద్రుని
పరాజయము పాలొనర్చె!

దితిజేశ్వరు చేతనోడి
దిక్పాలురు హరిని జేరి
వాసుదేవ! కావుమంచు
వాపోయిరి దీనమ్ముగ!

భయము వలదు సురలారా!
బలి గర్వము నణచివైతు
వేచియుండుడనుచు పలికి
విష్ణువు అభయంబొసగెను!



అటు పిమ్మట చక్రధారి
అదితి కశ్యపుల సుతునిగ
వామనునిగ నవతరించి
వటువు రూపమును పొందెను

చిన్న గొడుగు తల దాలిచి
చేతబట్టి కమండలము
బ్రహ్మతేజముట్టిపడగ
బయలుదేరె వామనుండు

బలిచేయుచునుండె నపుడు
బ్రహ్మాండమ్మగు యాగము
విప్ర వటుని రూపమ్మున
విష్ణువటకు నరుదెంచెను

వచ్చిన వటువును గని బలి
చెచ్చెర ఎదురేగి యపుడు
విప్ర బాలకా! రమ్మని
వినయమెసగ పలికెనిటుల!

వడుగా! ఎవ్వరి వాడవు
వసియించెడి స్థలమెయ్యది!
నీ యాగమనమ్ము చేత
నీ యాగము సఫలమయ్యె!

నా వంశము తరియించెను
నా జన్మముసఫలమయ్యె
ననుచు పలికె బలి యప్పుడు
ఆహ్వానించెను వటువును!

రావయ్యా! వటూత్తమా!
రమ్ము రమ్ము యాగమునకు
వనములు భూములు ఫలములు
వస్త్రమ్ములు కావలెనా!

రత్నమ్ములు కావలెనా!
రాజ్యమ్ములు కావలెనా!
నీ కోరినదేదైనను
నీకిచ్చెద వటూత్తమా!

అని పలికిన బలిని చూచి
అనియెనిట్లు వామనుండు
దానవేంద్ర! నీ మాటలు
ధర్మసమ్మతమ్ములు గద!

ఇదియే నా నెలవటంచు
నేగతి నే పలుకగలను!
అన్నిచోట్ల నేనుందును
అందరు నా వారేగద!

నీ వదాన్య గుణము రాజ!
నిక్కము ప్రశంసనీయము
నిన్ను బోలినట్టి దాత
నిజము లేదు విశ్వమ్మున!

రత్నమ్ముల రమణులను
రాజ్యమ్ములనిత్తుననుచు
పలికిన నీ పలుకుల విని
పరమానందము కలిగెను



రాజ్య సంపదలు కలిగిన
పూజ్యులకును యాచకులకు
దాన ధర్మములు చేసిన
ధన్యుడగును వాడిలపై

వేడను నిను రాజ్యమ్ముల
వేడను నిను సంపదలను
మూడడుగుల నేల నాకు
మోదమ్ముగ దానమిమ్ము

బ్రహ్మచారినైన నాకు
బ్రహ్మాండంబిచ్చినట్లు
అంతకు మించిన దానం
బసురేంద్రా నాకు వలదు!

కమండలమొ దండమ్మో
కాదేనొక ఛత్రమ్మో
ఇచ్చిన చాలీవటువుకు
ఏల నాకు రాజ్యమ్ములు!

తృప్తి లేని మానవుండు
ముక్తినందలేదు గదా!
ఆశను జయించ లేకనె
అంతమైరి మున్నెందరొ!

అని పలికిన వామనుగని
అనియెనిట్లు దానవపతి
అరెరే! పసి బాలుండవు
అడుగ నేరవైతి వీవు!

అసురేంద్రుని కడకు వచ్చి
అడిగితివా మూడడుగులు
నీ వడిగిన దానమ్మును
నీకిచ్చెద వెను వెంటనె!

అని జలపాత్రను చేగొనె
అసురేంద్రుడు సంతసముగ
అంతట దనుజాచార్యుం
డగు శుక్రుండిట్లనియెను

రాజా! తొందర పడకుము
రానున్నది పెను ఆపద
ఈ పద త్రయంబు నడిగిన
దెవరో నీ వెరుగుదువా!

హరి యితండు సురల కొరకు
అర్థించగ వచ్చినాడు
నీ వీతని కోర్కె దీర్ప
నిఖిలమ్మును గోల్పోదువు!

నీ సంపద నశియించును
నీ రాజ్యము గోల్పోదువు
మూడడుగుల తోడ నితడు
ముల్లోకములాక్రమించు!

దానవేంద్ర! నీవితనికి
దానమీయ వలదు నేల
వినవయ్యా! నా మాటలు
వెనుకముందు చూడవయ్యా!



రమణుల గోవుల విప్రుల
రక్షించుటయందు గాని
వివాహ విషయముల మాన
విత్త ప్రాణ భంగమందు

బొంకవచ్చు నసురాధిప!
పొందదు పాపము సుంతయు
అనుచు పలికె శుక్రనీతి
అసురాచార్యుండప్పుడు

అర్ధనిమీలిత దృక్కుల
ఆచార్యుని మాటలు విని
అదరక బెదరక వగవక
అసురేంద్రుడు బలియిట్లనె!

ఎందరెందరో రాజులు
ఇవ్వ సుధా స్థలి నేలిరి
కాల గర్భమున వారలు
కలిసిపోయినారు గదా!

క్రతువుల వ్రతముల పూజల
కడు దుర్లభమైన వాడు
వామనుడై వేడను నను
వచ్చినాడు నా వద్దకు!

శ్రీనాథుండిట్లు వచ్చి
చేయి చాప నా ముంగిట
మేలుగదా, ఎప్పుడైన
రాలు గదా కాయంబది!

రానిమ్మే ఆపదైన
రాజ్యమ్మే పోవనిమ్ము
మాట యిచ్చినాను నేను
మరి తిరుగదు నా నాలుక

ఈ వచ్చిన అభ్యాగతు
డెవ్వరైన కానిమ్ము
హరిహర బ్రహ్మాదులందు
అతడెవరైన నదేమి

మేరువు తలక్రిందైనను
పారావారములింకిన
ధారుణి పొడిపొడి యైనను
తారాధ్వము మీద పడిన

ఇచ్చిన మాటను తప్పను
ఇచ్చెద నీతనికి నేల
అని త్రికరణశుద్ధిబల్కి
యాహ్వానించెను వటువును!

వింధ్యావళి నీరు పోయ
విప్ర వటువు పాదములను
కడిగెనప్పు డసురేంద్రుడు
కడుముదమున భక్తితోడ

దానమీయ మూడడుగుల
ధాత్రినప్పు డసురేంద్రుడు
దాన ధార పోయ సాగె
ధరణి సురుని చేతి యందు!



దానవగురువగు శుక్రుడు
తానొక కీటకమగుచును
దాన ధార కడ్డుపడగ
దాని నెరిగె కపటవటువు!

కుశాగ్రమ్ము కరమునగొని
కుశలబుద్ధి కపట వటువు
కలశ రంధ్రమున పొడువగ
కన్ను పోయె శుక్రునకును!

వదాన్యశేఖరుడగు బలి
వదలెనపుడు దానధార
వసుధా దానమునిచ్చెను
వటువు కోరినట్లుగనె!

దానవేంద్రుత్యాగమునకు
దాననిరతి కచ్చెరువడి
సురలు మునులు నభము నుండి
విరుల వాన కురిపించిరి!

వామనుండు దాన మంది
వర్ధిల్లెను క్రమ క్రమముగ
త్రివిక్రముండగుచుతాను
త్రిజగమ్ముల నాక్రమించె

ఒక్క అడుగు భూమిపైన
ఒక్క అడుగు నభమున నిడి
మూడవ అడుగెక్కడయని
ముసిముసి నగవుల నడిగెను!

చిరునవ్వులతో వెరవక
శిరమును చూపించెను బలి
బలితలపై పదము మోపి
మెల మెల్లగ త్రొక్కెను హరి!

బలి రసాతలమ్ము చేరి
ప్రభువై పాలించెనచట
విష్ణు దేవు మహిమల పలు
విధముల కీర్తించెను బలి!

ఆ రీతిగ సురల వెతలు
అడగించెను శ్రీహరి!
ఇది వామన దివ్యకథ
సదమల భాగవత సుధ!

* * *



# 5. శ్రీకృష్ణ జననము

శ్రీహరి యదువంశమ్మున
శ్రీకృష్ణునిగా పుట్టిన
సుమధురభాగవత గాథ
శుకముని వర వినిపింపుము!

అనుచు పరమ భక్తి తోడ
యడిగినంత పరీక్షితుడు
శ్రీకృష్ణుని జనన గాథ
చెప్పదొడగె శుక మహర్షి!

శూరసేన యదువీరుని
సూనుడు వసుదేవుడు
ఉగ్రసేన సుతదేవకి
నుద్వాహం బాడెను!

ఉగ్రసేను కొకకుమారు
డుండెను కంసుడతండు!
చెల్లిని బావను రథమున
నుల్లాసమ్మున నిడుకొని
కాపురమున కంపగ మథు
రాపురమ్ము నుండి కదలె!

అత్తరి వినిపించెనిట్లు
అతనికి ఆకాశవాణి
“ఓ కంసా! దేవకి అష్టమ
గర్భమందు జనియించెడు
సంతానము చేతియందు
అంతము కాగలవు నీవు”

గగనవాణి పలుక యిట్లు
కంసుడు దిగ్గున నిలబడి
కత్తి దూసి తన సోదరి
కుత్తుక తెగనరుక బూనె!

ఎంచక తోబుట్టువనుచు
ఎంచక నవోఢయంచును
కర్కశమ్ముగా దేవకి
కంఠము తెగ నరుకబోవు
కంసునితో వసుదేవుడు
కడు దీనముగా బలికెను!

బావా! అశరీరవాణి
పలుకులు నిజమని నమ్మకు!
చెల్లెలినే చంపబోవ
చెల్లునె! తగునా నీకిది!

అన్నవు సోదరినెంతో
మన్నన గావించవలెను
కళ్యాణపు నవ వధువును
కత్తికి బలి చేతువేమి!
కనికరించి విడువుమయ్యా
కాని పనులు చేయకయ్యా!



వసుదేవుండీవిధముగ
పలు రీతుల వేడినంత
నిలిచెను కంసుడొకింతన
పలికె నపుడు వసుదేవుడు!

“నా అష్టమ సంతానము
నీకంతకుడగు నటంచు
గగన వాణి పలికె గదా!
కావున ఒక మాట వినుము!

పుట్టిన నా పట్టినెల్ల
పుట్టిన మరు నిముసమందె
పట్టి తెచ్చి నీకిచ్చెద
పట్టి వధింపుము విడువక!

అని పలుకగ వసుదేవుడు
విని కంసుండూరకుండె
బ్రతుకు జీవుడాయనుకొని
వసుదేవుండింటికి జనె!

ఇచ్చిన మాట ప్రకారము
తెచ్చి యిచ్చె వసుదేవుడు
పుట్టిన సంతును కంసుకు
పుట్టెడు దుఃఖము మ్రింగుచు!

అచ్చెరువున వసుదేవుని
సచ్చరితను మెచ్చుకొనుచు
తెచ్చిన శిశువును చంపక
ఇచ్చె తిరిగి తనబావకు!

ఆ పిమ్మట నొక్కనాడు
అరుదెంచెను నారదుండు
కంసునకును తెలిపెనతడు
కాలనేమి దానవుడని!

బృందారక బృందమ్ములు
నందాదులుగా ధరపై
మందలోన యదు కులమున
బృందములుగ పుట్టిరనుచు!

దేవకి గర్భమునందున
దేవదేవుడగు శ్రీహరి
దానవాంతకుండు నగుచు
ధరణి నవతరించునన్న
కబురు చెప్పిమెలమెల్లగ
కదలిచనియె నారదుండు!

ఆ మాటలు వినినంతన
ఆగ్రహముగ నా కంసుడు
దేవకి సుతులార్గుర బలి
కావించెను తనకత్తికి!

ఉగ్రసేను తన తండ్రిని
ఉంచెను కారాగృహమున
బావను చెల్లిని తడయక
బంధించెను చెరయందున!

కారాగృహమున సప్తమ
గర్భము దాల్చెను దేవకి
యోగమాయ ఆ చూలును
యోగీశ్వరు హరి పనుపున
నంద గృహిణి గర్భమ్మున
పొందికగా నిలువ జేసె!



నంద గోకులమ్మునందు
నందుని గేహమ్మునందు
రోహిణి సుతునిగ పుట్టెను
రోచిష్ణుడు బల రాముడు!

అటుపై దేవకి దేవికి
అష్టమ గర్భమ్ము కలిగె
వెలసె నామె గర్భమ్మున
విశ్వమయుడు విష్ణుమూర్తి!


నెలలు మీద పడుకొలంది
కళకళ లాడెను దేవకి
కళలు క్రమమ్మున హెచ్చగ
నెలరాజు వెలుంగునట్లు!

దేవకి కడుపున విష్ణువు
దినదినమ్ము వృద్ధినంద
కంసుని హృదయాన దిగులు
క్షణక్షణమ్ము వృద్ధియయ్యె!

కారాగృహమున దేవకి
భారమ్ముగ మసలు చుండ
సూక్ష్మ రూపులగుచు వచ్చె
సురలెల్లరు నచ్చోటికి!

దేవకి గర్భమున నున్న
దేవదేవుడగు విష్ణుని
మత్స్యాద్యవతారమ్ముల
మహిత గతుల స్తుతియించిరి!

అంతట తారలు గ్రహములు
అంతి శుభస్థితి నుండగ
అష్టమి శ్రావణ బహుళం
బర్ధరాత్రి సమయమ్మున
దుష్ట శిక్షణార్థమ్మయి
శిష్టరక్షణార్థమ్మయి
అష్టమ సంతానమ్ముగ
హరి దేవకి కుమారునిగ
నవనిపైన నవతరించె!
భువనమ్ములు సంతసించ!



శంఖ చక్ర గదా ధరుడు
జలధర శ్యాముడు విష్ణువు
వనమాలా విరాజితుడు
వసుదేవుని కనుల బడెను!

దేవకి వసుదేవులపుడు
దేవదేవు విష్ణు మహిమ
పరి పరి విధముల స్తుతించి
పరమానందమునందిరి!

అంతట వసుదేవుడపుడు
హరిమాయా ప్రేరితుడై
శిశువునుగొని అర్ధ రాత్రి
చెరసాలను వీడి వచ్చె!

జోరున వర్షమ్మప్పుడు
ధారగ కురియుచునుండెను
వరదతోడ యమునానది
దరులు దాటి పొంగుచుండె



పడగలతో పాప రేడు
గొడుగు పట్టె శిశువునకు!
దరులొరసిన యమునా నది
దారి యిచ్చె నచ్చెరువుగ!

వేగమ్ముగ వసుదేవుడు
వ్రేపల్లెకు చేరుకొనెను!
మందలోని వారు నిదుర
మత్తులోన మునిగియుండె!

శిశువుతోడ వసుదేవుడు
చేరెను నందుని యింటికి
నందుని సుందరి యశోద
నిదురలోన మునిగి యుండె!

తన బిడ్డను యశోద చెం
తన పడుకొనబెట్టియతడు
యశోద కన్నట్టి ఆడ
శిశువుని గొనె వసుదేవుడు

నిశీధిలో చెరసాలకు
నిశ్శబ్దమ్ముగను చేరి
పడుకొన బెట్టెను దేవకి
ప్రక్కలోన శిశువునపుడు!

నందునింట నల్లనయ్య
నందనందనునిగ పెరిగెను
యశోద ముద్దుల బిడ్డగ
యశమునందె గోకులమున

గోబృందమ్ముల మేవుచు
గోపాలుర గూడి తిరిగె
రమణులతో సంచరించి
రాసక్రీడలనాడెను!

“యుక్త వయసు వచ్చి యుక్తి
యుక్తుడగుచు మధురకేగి
మదగజమును నేల గూల్చి
మట్టుబెట్టె మల్లురను

గూని చాన యగు కుబ్జకు
కోమల రూపమ్ము నిచ్చె
సుందరమాలికలిచ్చిన
సుదామునను్రగహించెను!

కండ కావరమ్ము తోడ
కత్తిగట్టి నట్టిమేన
మామయైన కంస దనుజు
మట్టుబెట్టె నవలీలగ!

ఇది కృష్ణుని జనన గాథ
సదమల భాగవత సుధ!
పరమానంద మొసంగెడు
పరమాత్ముని దివ్య కథ!

* * *



# 6. శ్రీకృష్ణ లీలలు

శ్రీకృష్ణుడు గోకులమున
చేసి చూపెలీలలెన్నో
ముచ్చటైన ఆ కథలను
మునినాథా! వినగోరెద!

అని అడుగగ పరీక్షిత్తు
ముని వరుడగు శుకమహర్షి
బాలకృష్ణ లీలలెల్ల
పరీక్షిత్తునకిట్లు తెలిపె!


నందుని సుందరి యశోద
అందమైన మగ శిశువును
కన్నదన్న వార్త మంద
యందంతయు వ్యాపించెను!

నల్లనయ్య మందలోని
గొల్లభామలందరకును
పంచప్రాణమ్ములయ్యె
పరమానందంబయ్యెను!

దినదినమున కొకరీతిగ
కనులకు విందులు చేయుచు
బాలకృష్ణుడతులితముగ
లీలలెన్నొ చేయ సాగె!

## పూతనకథ:

ఒక్కనాడు వ్రేపల్లెకు
చక్కని రూపమ్ముతోడ
నిక్కచు నీల్గుచు వచ్చెను
రక్కసి యగు పూతన



వెన్నుండగు శ్రీకృష్ణుని
విషమునిచ్చి చంపనెంచె
చనుదెంచెను సరాసరిగ
చనుబాలను త్రావించగ!

ముద్దులొలుకు బాలకృష్ణు
ముద్దియ తనయొడిని చేర్చి
తనస్తన్యము నీయగ పూ
తన రక్కసి పూనుకొనెను!

పూతన పన్నగ మెరిగి
పురుషోత్తముడగు శ్రీహరి
చను బాలను త్రావి త్రావి
దనుజ ప్రాణముల ద్రావెను!

అసువులు బాసిన పూతన
అందరు చూచుచు నుండగ
భయంకరాకారముతో
పడిపోయెను పుడమి పైన

రక్కసి శవమును గాంచిన
అక్కడి గోపాలురెల్ల
నందతనయు లీలను నా
నందనమ్ముగ గాంచిరి



## శకటాసుర సంహారము:

ఒక్కనాడు వ్రేపల్లెకు
రక్కసు డొక్కడు వచ్చెను
శకటాసురు డనెడువాడు
చయ్యన కంసుని పనుపున!



చెన్ను మీరు శైశవమున
చిన్ని నవ్వులొలక బోయు
కన్నయ్యకు దనుజు రాక
కారణమది మదితెలిసెను!

పారిపోయి బండికడకు
పాదమ్ములతో తన్నెను
గగనమ్మున కెగిరి బండి
కకావికలుగా నయ్యెను!

## తృణావర్త సంహారము:

వడివడిగా ఒక్కనాడు
సుడిగాలిగ దనుజుడొకడు
నందనందనుని హరింప
మందలోకి చనుదెంచెను!



ఘనముగ పెను గాలివీవ
కనుల లోన పడెను దుమ్ము
కనుల ఎదుట నున్న శిశువు
కనబడ కుండా పోయెను!

ఆడుకొనెడు బిడ్డయిట్లు
అదృశ్యంబై పోవగ
బాలకృష్ణు కొరకు తల్లి
చాలగ దుఃఖించెనపుడు!

గాలి దుమ్ము బిడ్డ తోడ
గగనమ్మున కెగిరిపోవ
అంతకంతకును హెచ్చిన
దంత బిడ్డ యొక్క బరువు!

పర్వతమ్ము వంటి బాలు
బర్వు మోయలేక వాడు
రాళ్ళనేల మీద కూలి
ప్రాణమ్ములు కోలు పోయె!

**బాలకృష్ణుని అల్లరి:**

అల్లరి కృష్ణుని చేష్టల
తల్లికెరుగ జేయనెంచి
ఒకనాడరుదెంచిరి గో
పిక లెల్ల యశోద కడకు!




వారంతా ఒక్క రొకరు
వారిజ నేత్ర యశోదకు
విన్నివించిరీ రీతిగ
వెన్నదొంగ యాగడములు!

అమ్మా! మీ పిల్లడు పా
లన్నియు పడుచులకు బోసి
పగుల గొట్టె కడవలనని
పడతి యొకతె వాపోయెను!

వచ్చినాడు మా యింటికి
వనితా! మీ పిల్లవాడు
వెన్న దొంగిలించె నంచు
వెలది యొకతె వాపోయెను!



ఒకరింట్లో పాలు త్రాగి
ఒకరింట్లో కడవలిడగ
గొడవయ్యెను వారికంచు
పడతి యొకతె పలికెనంత!



ఇంతీ! మీ పిల్ల వాడు
బంతి పడినదంచు వచ్చి
జలకమాడు మా బిడ్డను
పలకరించె నని నొక్కతె!

ఒక యింట్లో ఆటలాడు
ఒక యింట్లో పాటపాడు
ఒక్కటనల్లరి చేయును
ఒక్కచోట దూకుగెంతు!

చెలియ! నీ కుమారుండు
చేయని అల్లరియె లేదు
మా యిండ్లను పాలుపెరుగు
మననీడమ్మా సుంతయు!
పోయెద మెక్కడికైనను
మా యన్నల సురభులాన!

అనుచు వ్రేతలెల్ల కృష్ణు
అల్లరి పనులు యశోదకు
పూస గుచ్చినట్లు చెప్ప
పొలతి వారి కిట్లనియె

అయ్యో మా పిల్లవాడు
అల్లరియే యెరుగడమ్మ!
వానినిట్లు రచ్చ కీడ్చ
వనజ నేత్రలార తగునె!
యనుచు వారినెల్లరనూ
అనునయించి పంపెనామె!

## మట్టి తిన్న చోట విశ్వమ్మును చూపుట:

ఒక్కనాడు గోపాలురు
ఒక్కుమ్మడి గాను వచ్చి
మన్ను తినెను కృష్ణుండని
మాత యశోదకు చెప్పిరి!



ఉన్నవి గద మనయింటను
వెన్న పాలు మీగడలు
మన్నెందుకు తిన్నావని
మాత మందలించె కృష్ణు!

అమాయకమ్ముగ కృష్ణుడు
అమ్మా తినలేదు మన్ను
చూడుము వాసన యంచును
చూపెను తన నోరు తెరచి

అప్పుడు కృష్ణుని నోటను
ఆమె చూచె సముద్రములు
అడవులు వనములు భూములు
ఆదిత్యాది గ్రహమ్ముల!

బాలుని వదనమున సకల
బ్రహ్మాండమ్ములను జూచి
కలయా! యిది మాయాయని
కలవర పడెను యశోద!

అంతలోనె మాయ కమ్మ
అమ్మ యశోద కుమారుని
కొడుకా! యని ఎత్తుకొనుచు
ఒడిని జేర్చి పాలిచ్చెను!



## యమళార్జున భంజనము:

కరకంకణములు మ్రోయగ
తురుమల్లల వీడియాడ
ఒక్కనాడు యశోదమ్మ
చిక్కని దధి చిలుకుచుండె!



పెరుగు పాలు పోయుమనుచు
వెన్న తనకు కావలెనని
నల్లనయ్య తల్లి వద్ద
అల్లరి చేయగ సాగెను!

నల్లనయ్య చేయునట్టి
అల్లరి భరియించలేక
తల్లి యశోదమ్మ బాలు
తాడు తోడ గట్టనెంచె!

నల్లనయ్య అందకుండ
తల్లిని తప్పించుకొనుచు
అటునిటు పరుగెత్త సాగె
అలసి పోయె యశోదమ్మ!

పకపక నవ్వుచు కృష్ణుడు
చకచక పరువెత్తుచుండ
ఘల్లుఘల్లున నతని కాలి
గజ్జెలు రవళింప సాగె!

తుదకు నవ్వుచును కృష్ణుడు
దొరకెను యశోద చేతికి
యశోదమ్మ బంధించెను
అప్పుడతని నొక రోటికి!

ఆ రోటిని లాగుకొనుచు
పారాడుచు కృష్ణుడపుడు
మందహాస మొలుక రెండు
మద్ది చెట్ల మధ్య కేగె!

నారద శాపవశమ్మున
నలకూబర మణి గ్రీవు
లను యక్షులు మద్ది మ్రాను
లగుచు నచటయుండిరి!

ధాటిగ రోటిని లాగగ
తరులు రెండు కూలి పోయె
యమళార్జునముల బదులుగ
యక్షులు ప్రభవించిరచట

శాపముక్తులగుచు కృష్ణ
చరణములకు మ్రొక్కులిడుచు
కృష్ణుని పరి పరి విధముల
కీర్తించుచు చనిరి వారు!

## వత్సాసుర సంహారము:

రామకృష్ణులొక్కనాడు
యమునానది తీరమ్మున
ఆలమందలను మేపుచు
లీలగ విహరింపసాగె!

వచ్చెను కంసుని పనుపున
వత్సాసురుడనెడు వాడు
పూని ధేను రూపమ్మును
పూనికతో కృష్ణు జంప!



వత్సాసురు గమనించిన
వసుదేవ సుతుండప్పుడు
వత్సాసురు పట్టి తిప్పి
వడిసెల వలె విసరి కొట్టె!

వాసుదేవుడారీతిగ
వత్సాసురు పరిమార్చగ
గోపాలకులు ముదమ్మున
'గో' యని యార్చిరి యాడిరి!

## బకాసుర సంహారము:

మరియొకపరి కొంగపగిది
మరియొక రక్కసుడు వచ్చి
జపము చేయుచున్న మౌని
చందమ్ముగ నిలచి యుండె!



ఒక్కసారి అదను చూచి
రెక్కల నల్లార్చి ఎగరి
వేగమ్ముగ దూకి మ్రింగె
వేణులోలు బాలకృష్ణు!

మ్రింగుడు పడకను కృష్ణుడు
కొంగ గొంతు కడ్డము పడె
మ్రింగ లేక కక్క లేక
కొంగ తల్లడిల్లె తుదకు

బయటకు క్రక్కెను కృష్ణుని
బకమ్ము కడు ప్రయాసపడి
ముందుకు దూకెను కృష్ణుని
ముక్కు తోడ పొడిచి చంప!

బకము ముక్కు చేత బట్టి
బరబర చీల్చెను కృష్ణుడు
సురసంఘము కృష్ణుని పై
విరులవాన కురిపించిరి!

## బాలకృష్ణుడు గోపాలురతో కూడి చల్దులు తినుట:

గోపాలురతోడ గూడి
గోగణముల వెంట నడచి
రాముడు కృష్ణుడు కాంతా
రమ్మున కేగిరి ముదమున



చంకలందు పొంకమ్ముగ
చద్దుల మూటలు వ్రేలగ
పిల్లనగ్రోవుల నూదుచు
పెద్దగ కొమ్ముల నూదుచు

ఆలమందలను మేపుచు
నడవిలోన తిరుగాడిరి
ఆడిరి పాడిరి దూకిరి
ఆయాసమ్మును పొందిరి

అలసిన గోపాలుర గని
అంతట కృష్ణుడు పిలచెను
రండో గోపాలురార
రయముగ తిందుము చద్దుల


అని పిలువగ గోపాలకు
లందరు చుట్టున చేరిరి
కమల దళమ్ముల మధ్యన
కర్ణిక వలె కృష్ణుడుండ



విప్పిరి చద్దుల మూటలు
వికవిక పకపక నవ్వుచు
తిన సాగిరి పెరుగన్నము
తీరు తీరుగా నందరు

ఊరించుచు ఒకరినొకరు
ఊరగాయ నంచుకొనుచు
ఒకరన్నము ఒకరు తినుచు
ఒకరి నొకరు కికురించుచు

నవ్వించుచు కవ్వించుచు
నర్మభాషణములాడుచు
గోపాలకులందరితో
గోవిందుడు చద్దులు తినె



## బ్రహ్మ గర్వ భంగము:

తలపై నెమలీక దాల్చి
మొలలో వేణువును జొనిపి
కంఠమందు హారమ్ములు
కళకళ లాడుచు వ్రేలగ!


గోవిందుడు అడవులలో
గోవుల దూడల మేపుచు
దుర్గమగు మార్గమ్ముల
దూర దూరములకు నేగె

గోగణముల లేగలను
గోపాలుర గనివిరించి
హరి తత్వమ్మునెరుంగక
నందరను దాచివేసె!

బ్రహ్మ చేసినట్టి మాయ
బాలకృష్ణునకు తెలసెను
యథాతథమ్ముగ సృజించె
విధాతయై గోగణముల!

గోగణముల వత్సమ్ముల
గోపాలురనందరనూ
యథాతథమ్ముగ కనుగొని
విధాత గర్వమ్మణగెను!

బ్రహ్మలసృజియించినట్టి
బ్రహ్మ యంచు హరినెరింగి
నందనందనుని పదార
విందములకు మ్రొక్కెను విధి!



**కాళీయ మర్దనము:**

కాళింది మడుంగున పెను
కాళమ్మొక్కటియుండెను
దాని విషము చేత జలము
ప్రాణాంతకమై పోయెను!

గోపాలురు గోగణములు
ఆ పానీయముల ద్రావి
ప్రాణమ్ములు గోలుపోయి
పడిపోయెను ఒక్కనాడు!

గోపాలుర గోగణముల
కాపాడెను కృష్ణుడపుడు
కాళీయుని మదమణంచ
గానెంచెను మనములోన!



కటిచేలంబు బిగించెను
కచ భరమును బంధించెను
పాణి ద్వంద్వము బిగించి
పదయుగమ్ము కీలించెను!

మడుగు చెంతనున్న నొక్క
మహీరుహము పైకి నెక్కి
మడుగులోకి దూకెనపుడు
మట్టుబెట్ట కాళీయుని!

బుసకొట్టుచు కాళియాహి
భుగభుగమని జ్వాలలెగయ
విషమ్ము జిమ్ముచు వేగమె
వెడలెను తన మడుగు నుండి!

పాము భీకరముగనపుడు
బాలకృష్ణు చుట్టుకొనెను
కాల విషానలము చిమ్మి
కాటు వేసె పలుమారులు!

గోపాలురు గోపికలును
ఘొల్లుఘొల్లుమని యేడ్చుచు
హాహాకారములు చేసి
రయ్యహిపతి క్రౌర్యము గని

ఘోషయెల్ల ఘోషించెను
గోగణములు తల్లడిల్లె
భూతలమ్మువడకె నుల్కా
పాతమ్ములు జరిగెనపుడు

అంతలోన గోవిందు డ
మాంతమ్ముగ కాళీయుని
బంధనముల చేదించుక
పడగలపైకెక్కి నిలిచె!

తరంగముల యమునానది
మృదంగములుమ్రోగించగ
కాళీయుని ఫణముల పై
గావించెను నాట్యమ్మును!

కాళీయుని పొగరంతయు
కలసిపోయె మడుగులోన
లీలా గోపాలు చేత
డీలా పడిపోయెనతడు!

కాళీయుని సతులు వచ్చి
కేళులు మోడ్చి నుతించిరి
కృష్ణా! మన్నింపుమనుచు
కృప జూపగ వేడుకొనిరి!

పొగరడిగిన కాళియాహి
పోయెను రత్నాకరముకు
గోపాలుర గోగణముల
కాపాడెను కృష్ణుడట్లు!

## గోవర్ధనోద్ధరణము:

నందాదులు ఒక్కమారు
ఇంద్రుని ప్రీత్యర్థముగా
ఆగమోక్త విధానమున
యాగమొకటి చేయనెంచె!





వారల పూనికను గాంచి
వాసుదేవుడిట్లు పలికె
ఆర్యులార! మీరీగతి
యాగమ్మును చేతురేల!

ఈ మఖమ్ము దేని కొరకు
ఏమి ఫలము దీని వలన
వినగోరెద వివరింపుం
డని పలికెను వారి తోడ

ఈ మఖమ్ము చేసినచో
నింద్రుడు సంతోషించును
వాసవుండు ముదమందిన
వానలు కురిపించ గలడు

కురిసెనేని పసరములకు
కోరినంత కసవు దొరకు
పాడి పంటలగు ననుచును
పలికిరి యాదవులెల్లరు

బాలకృష్ణుడపుడు వారి
పలుకులెల్లవిని నవ్వుచు
ఇంద్రుని సంప్రీతి కొరకు
ఏల చేయ వలె మఖమ్ము!

పర్వతముల పూజింపుడు
పశుగణముల పూజింపుడు
బ్రాహ్మణులను పూజింపుడు
ప్రకృతి పూజలను సేయుడు

పాయసమ్ముల పూపమ్ముల
బహు నైవేద్యముల తోడ
సంతసింప జేయుడయ్య
సకల జీవ కోటి నంచు!

సూచించగ శ్రీకృష్ణుడు
సూచనలౌదల దాలిచి
గోవర్ధన పర్వతమును
గొప్పగ పూజించిరపుడు!

పూజ తనకు చేయకుండ
భూధరమును పూజించిన
యాదవ సంఘమునే నమ
ర్యాద తనకు జరిగెననుచు!

సంక్రందనుడాగ్రహించి
సంవర్తకముల బిలచెను
పలికెనిట్లు! పటు తరగతి
వచ్చిన మేఘముల తోడ!

పాలు పెరుగు నెయ్యి త్రావి
బలిసినట్టి గొల్ల లెల్ల
బాలకు వచనాలు వినుచు
నా పూజలు మానినారు!

గర్వాంధులు యాదవులను
గట్టిగ శిక్షింప వలెను
గొల్లలెల్ల తల్లడిల్ల
కురుపించుడు కుంభ వృష్టి!



ఉరుములతో పిడుగులతో
ఊపిరాడకుండ జేసి
కొండల పెట్టుండనుచును
బృందారక పతి పలికెను!

వెను వెంటనె విను వీధుల
విస్తరించె మేఘ పంక్తి
కార్మొయిళ్ళు క్రమ్ముకొనగ
కటిక చీకటులు క్రమ్మెను

కుండ పోతగవానలు
కురియ సాగె ఘోష పైన
పెను గాలులు వీయసాగె
పిడుగులు పడసాగెనపుడు

రాళ్ళ వాన తోడ ప్రజలు
రాయిడి పడి పోసాగిరి
గోగణములు తల్లడిల్లె
గోపాలురు భీతిల్లిరి

ఆందోళన చెందినట్టి
ఆభీరులు పరుగులెత్తి
కృష్ణా! నీవే దిక్కని
కేళ్ళు మోడ్చి మొరవెట్టిరి!

నంద సుతుండప్పుడు సం
క్రందను దుర్నీతి యెరిగి
రండు రండు భయపడకుడు
రక్షించెద మిమ్మందర

అనుచు పలికి కృష్ణుడపుడు
తన చిటికెన వ్రేలి పైన
గోవర్ధన గిరిని లేపి
గోపాలుర పిలచెనిట్లు

బాలుడితడు పర్వతంపు
భారమ్మును మోయడనుచు
భయపడకుడు బంధులార
భద్రమ్ముగ నుందురిచట

అని పలుకుచు నందరకును
అభయమిచ్చె కృష్ణుడపుడు
కొండ గొడుగు క్రింద చేరె
గో గోపకులందరపుడు

వాసుదేవులీలల గని
వాసవుండు సిగ్గు పడుచు
శరణు శరణు కృష్ణా యని
చరణమ్ముల వ్రాలెనపుడు

గోవిందుండీరీతిగ
గోవర్ధనగిరి నెత్తిన
పావనమగు గాథ యిద్ది
సదమల భాగవత సుధ!

* * *



# 7. రుక్మిణీ కళ్యాణము

శ్రీకరములు శుభకరములు
శ్రీహరి కళ్యాణ కథలు
వినిన కొలది మరల మరల
వినవలె ననిపించు చుండు

అమృతముతో సమానమౌ
ఆ సురుచిర గాథలందు
రుక్మిణి కళ్యాణ గాథ
రుచిరంబతిరసవంతము

కుండిన పురమ్ము నేలుచు
నుండెను భీష్మకుడు రాజు
అతనికి పుత్రకు లేవురు
అందరలో రుక్మి పెద్ద

ఏవురు సుతులకు పిమ్మట
భూవరునకు కలిగెను సుత
క్షీర సాగరమ్ము నందు
శ్రీరమణి జనించినట్లు

ఆ బాలిక రుక్మిణియను
అభిద తోడ రాజిల్లెను
కుండిన పతి గేహమ్మున
పండు వెన్నెలలు నిండెను

దివ్యమైన తేజముతో
దిన దినమ్ము వృద్ధి నందు
బాలను గని తలిదండ్రులు
బ్రహ్మానందము నందిరి

ఆటలతో పాటలతో
అమృత మొలుకు మాటలతో
ఆ బాలిక అందరకును
ఆనందమొసంగు చుండె

తండ్రి వద్ద కేగు దెంచు
తాపసోత్తములు నిత్యము
శ్రీకృష్ణుని గూర్చి చెప్ప
చిత్తమలర వినె రుక్మిణి

వినగ వినగ రుక్మిణి హృది
వెన్నదొంగ వశమయ్యెను
నంద నందనుండె తనకు
నాథుడంచు మదినమ్మెను

అది మొదలుగ ఆమె మనసు
యదునందను నందె నిలచె
పవలు రేయి కృష్ణుని పై
ప్రాణమ్ములు నిలిపి యుంచె

భువన మోహనముగ వెలుగు
కువల యాక్షి రుక్మిణికి
తగిన వరుడు కృష్ణుడెయని
తలి దండ్రులు భావించిరి



తండ్రి తలపులను కాదని
తన సోదరి మనసెరుగక
చెల్లెలు రుక్మిణిని రుక్మి
శిశుపాలునకీయ దలెచె

అన్నవనీరజ లోచన
అన్న దురాలోచనెరిగి
వెన్నున కన్నియు తెలియగ
విప్రునొకని పంపించెను

అగ్ని ద్యోతనుడను ఆ
అవనిసురుడు ద్వారక జని
నవ నీరద సుందరుడగు
నందనందనుని గాంచెను

పరమ పురుషు గాంచినంత
భక్తి పారవశ్యముతో
బ్రాహ్మణుండు శ్రీకృష్ణుని
బహువిధముల సంస్తుతించె

రుక్మిణి హృదయమె భూసుర
రూపమ్మున వచ్చినట్లు
కన్నియ సందేశమిట్లు
కన్నయ్యకు వినిపించెను

"శ్రీకృష్ణా! మనోహరా!
ఓ కరుణా పయోనిధీ!
కరివరదా! కమలాక్షా!
గరుడగమన! మురళీధర!

నీ గుణ గానమ్మును విన
నిఖిల ఖేదములు తొలగును
నీ సుందర రూపము గన
నిరుపమ మోదము కలుగును

నీ కోమల పదార్చనము
శ్రీ కైవల్య పదమ్ము
నీ సుమధుర నామ జపము
శ్రీకరమ్ము శుభకరమ్ము

నీ యందే నా చిత్తము
నీలమోహనా! నిలచెను
కంసారీ! ఖల విదారి!
కరుణ తోడ నను బ్రోవుము

జగదేక మనోభిరామ!
జగన్మాత శ్రీ లలామ
నిన్ను మున్ను పొందితాను
ధన్యత నందెను గాదా!

శ్రీకర! ఓ కరుణాకర!
నా కరమ్ము చేపట్టుము
నా మనోరథమ్ము తీర్పు
మో, మురళీ మనోహరా!

నీ పదాంబుజ ధ్యాయిని
ఆపదలో నున్న దాన
శిశుపాలుని బారి నుండి
శ్రీశా! నను కాపాడుము



నా పరిణయ వేళ వచ్చి
భూపతులను పార ద్రోలి
రాక్షస వివాహ విధాన
కృష్ణా! నను చేపట్టుము

వివాహ వేళకు ముందుగ
భవాని నర్చించుటకై
దేవళమున కేగు విధము
దేవా! మా యింట కలదు

ఓ! వనమాలీ తప్పక
ఆ వేళకు వచ్చి నన్ను
కొని పోవుము దయామయా
గోపవధూ మనోహరా!

ఓ! ప్రాణేశ్వర! నిజముగ
ఒక్క మాట వినుము ప్రభూ
నీ కరుణ లభింపదేని
నాకీ జీవితమె వలదు!

నీ వాగామృతము గ్రోలని
దేవా యీ వీనులేల!
పురుషోత్తమ నీకు గాని
శరీర సౌందర్యమేల!

నీలజలద నవ మోహన
నిన్ను గనని కన్నులేల
నీ యధరామృతమందని
జిహ్వాయేల శ్రీదయితా!

నీ వనమాలా పరిమళ
ములు గ్రోలని ఘ్రాణమేల
నీకు సేవలొనరించని
బ్రతుకదేల పరమపురుష!

నిన్నే నమ్మితి స్వామీ
నీవే నా కేదుగడవు
నీ కొరకే నిరీక్షింతు
లోకేశా! శోకహరా!

రుక్మిణి హృదయమ్మె తాను
రూపు దాల్చి వచ్చినట్లు
పూసగుచ్చినట్లు చెప్పె
భూసురుండు సకలమ్మును

అగ్ని యజ్ఞహవిస్సులను
హరికందించెడు విధమున
అగ్ని ద్యోతనుడంతయు
హరికి నివేదించుకొనెను

అటు పిమ్మట శ్రీరుక్మిణి
అనుపమ సౌందర్యమ్మును
మధురిపు మనమున కెక్కగ
మధురమ్ముగ వర్ణించెను

తన పవిత్ర కర్తవ్యము
ధరణి సురుడు నిర్వహించి
పెండిలి కొడుకువు కమ్మని
కమ్మని ఆశీస్సులిడెను



ప్రాణప్రియ సందేశము
ప్రమోదమ్ము కలిగించగ
చెరగని చిరునగవు తోడ
శ్రీకృష్ణుడు పలికెనట్లు

ధరామరా నే వచ్చెద
ధరాధిపుల నిర్జించెద
వైదర్భిని గొని తెచ్చెద
వేదవిదుడ పోదముపద!

అన్నదె తడవుగ అరదము
నాయత్తము చేయించెను
విదర్భ దేశము చేరగ
వేగమ్ముగ తోలించెను

అక్కడ రుక్మిణి మనస్సు
అలజడితో నిండియుండ
తనయున కెదురాడ లేక
తలయొగ్గెను భీష్మకుండు

వివాహమున కేర్పాటులు
వేగమ్ముగ జరుగుచుండ
శ్రీహరి కొరకై రుక్మిణి
చింతించుచు చూడసాగె

సుముహూర్తము సమీపించె
కమలనేత్రుడేలరాడు
విప్రుని సందేశము విని
అప్రమేయుడేమనెనో

విధి నిర్ణయమెట్లున్నదొ
మధుసూదను తలపెట్టిదొ
పరమేశ్వరి కృపజూడదొ
మరి, నా భాగ్యంబేమో!

అని రుక్మిణి నిరంతరము
ఆందోళన పడుచునుండ
శిశుపాలుడు బలగముతో
చేరుకొనెను విదర్భకు

హరి రాకకు ఎదురుచూచు
హరిణేక్షణ సంతసించ
ధరణిసురుడు తిరిగివచ్చి
హరి రాక నెరుంగ జేసె

స్వామి వార్త తెచ్చినట్టి
సద్బంధుడు విప్రుని గని
సామోదముతో రుక్మిణి
సాంజలియై వినుతించెను

మంగళ వాద్యములు మోగ
అంగనలందరును రాగ
మంగళ గౌరిని గొలువగ
మంగళాంగి బయలుదేరె

ఆలయమ్మునందునున్న
ఆదిశక్తి మ్రోల నిలచి
అమ్మా! నమ్మితి నిన్నే
అనుగ్రహింపుము జననీ!



పురాణ జననీ దయతో
హరిని పతిగ జేయుమమ్మ
అనుచు నిండు భక్తి మొక్కి
ఆలయమ్ము వీడి వచ్చె

దివ్య భూషణాంబరముల
నవ్య వున్న మాలలతో
నవోఢ రుక్మిణి యప్పుడు
జగన్మోహనముగ నుండె

అంతలోన శ్రీకృష్ణుడు
దంతీంద్రుని పగిది వచ్చి
సుందరాంగి రుక్మిణిని
స్వందనమ్ము నందిడుకొని
చూపరులచ్చెరు వందగ
భూపతులెల్లరు భయపడ
పాంచజన్య రావంబది
పది దిక్కుల మారు మ్రోగ
వేగమ్ముగ తన రథమున
సాగె ద్వారకాపథమున

వధువు తోడ సాగి పోవు
మధు వైరిని నిర్జింపగ
సేనలతో వెన్నంటిరి
చైద్యాదులు రుక్మి గూడి

జరాసంధ శిశుపాలురు
మురాంతకుని సేనలపై
శరధారలు కురిపించుచు
చాలతడవు పోరాడిరి

సుందరాంగి రుక్మిణి సతి
స్యందనమ్ము తోలుచుండ
శ్రీహరి శిశుపాలాదుల
చెల్లా చెదరుగ చేసెను

ధ్రుతి చెడిశిశుపాలాదులు
బ్రతుకు జీవుడా యనుచును
ప్రాణమ్ములు నిలుపుకొనగ
పారిపోయి రొకరొక్కరు

కక్ష గట్టినట్టి రుక్మి
రూక్షమ్మగు మాటలతో
సోదరితో పోవునట్టి
యాదవేంద్రు నిందించెను

"మాసరి వాడవు కావే
మా పావను కొని పోదువు
మర్యాదలు లేని వాడ
మాన హీన" అని అరచెడు
రుక్మి నీచ భాషణలకు
చక్రి మహా క్రోధముతో
వాని శిరము ఖండింపగ
వడిగా ఖడ్గమ్ము దూసె

అన్నను సైరింపు మనుచు
ఆ నవ వధువగు రుక్మిణి
అన్నగధరు పదములబడి
మన్ననగా వేడుకొనెను



అనుంగు చెలి మనవి విన్న
అనుకంపానిధి కృష్ణుడు
మందహాసమొలుక, బావ
మరిదిని బంధించి పట్టి
గడ్డము మీసము కేశము
లడ్డముగా గొరిగి వేసి
ప్రాణమ్ములు తీయకుండ
పరాభవము చేసి పంపె

పగవారల నెల్ల గెలిచి
జగతి యెల్ల నుతియించగ
శ్రీకృష్ణుడు రుక్మిణితో
చేరె ద్వారకానగరికి

నానావిధ వాద్య ఘోష
భూన భోంతరముల నిండ
అంగన లెల్లరు పొంగుచు
మంగళ గీతములు పాడ

వేదవిదులు సుస్వరమున
పేద పఠన మొనరించగ
వైభవముగ శ్రీకృష్ణుడు
వైదర్భిని పెండ్లియాడె

ఇది రుక్మిణి పరిణయ కథ
సదమల భాగవత సుధ
సమస్త సంపత్కర మిది
సకలాభీష్ట ప్రదమ్మిది.

* * *



# 8. కుచేలోపాఖ్యానము

శ్రీకృష్ణుని చిన్ననాటి
స్నేహితుడొకండు కలదు
అతని పేరు కుచేలుడు
హరికతండు ఆప్తసఖుడు

ఆగర్భ దరిద్రుడైన
ఆ విప్రుడు కుచేలుడు
విజితేంద్రియు డాత్మవేత్త
విమలచిత్తుడనఘుడు

కలిగినంత దానియందె
కాలము గడుపునతండు
పరుల ఎదుట చేజాచని
పరమ మానధనుడతండు

గంపెడు సంసారమ్మది
గడుచుట కష్టముగనుండె
తినుటకైన తిండి లేక
దినదిన గండముగ నుండె

ఆకలితో అమ్మాయని
అరచునట్టి పిల్లలగని
తల్లడిల్లి కుచేలు సతి
తన పతితో నిట్లనియెను



"భక్త లోక వత్సలుండు
పరమ దయాసాగరుండు
శ్రీకృష్ణుడు భగవంతుడు
మీకనుంగు మిత్రుడు కద"

ద్వారకాపురమ్మునందు
శ్రీరమణీ మనోహరుడు
అతుల వైభవమ్ముతోడ
అలరారుచు నుండె గదా!

ఆ మహాత్ము వేడుకొనగ
మోమాటంబేల మనకు
చిన్న నాటి మిత్రుడెగద
చిన్నతనంబేమున్నది!

దుర్భరమీ దారిద్ర్యము
దుస్సహమీ కష్టమ్ములు
నాథా! దయ తోడ జగ
న్నాథుని దర్శించి రండు!

మన కష్టము లీడేరును
మన దారిద్ర్యము తీరును
ఆ దయామయుండు మనల
నాదుకొనును తప్పకుండ

అనుంగు సతి ఈ రీతిగ
అనునయముగ చెప్పినంత
పరమ పురుషు కృష్ణుని గన
పయనమయ్యె కుచేలుండు

బాల సఖుని కనబోవుచు
చేలమునందు కుచేలుడు
ముచ్చటపడి అటుకులిన్ని
మూటకట్టుకొని పోయెను

“ద్వారకాపురమ్ము చేర
నేరీతిగ పోగలనో
ద్వార పాలకులునన్నట
వారింతురొ లోనికేగ”

చిన్ననాటి మిత్రుడనని
మన్ననె చేయడె కృష్ణుడు
నన్ను గుర్తు పట్టగలడొ
నా భాగ్యంబెట్లున్నదొ!

అని మనమున అడుగడుగున
అనుమానించుచు విప్రుడు
అంతలోనె తన మిత్రుని
ఆనందమ్ముగ తలచుచు

“సుందర నందకిశోరుడు
మందహాస మృదువదనుడు
శిఖి పింఛ మనోహరుండు
వికచాంభోరుహ నేత్రుడు”

నిఖిలలోక పావనుండు
నీల జలధర శ్యాముడు
నల్లనయ్య వెన్నదొంగ
అల్లరి గోపకిశోరుడు



ఎట్లున్నాడో ఇప్పుడు
ఎంత ఎదిగి పోయినాడొ”
అని మనమున క్షణ క్షణమ్ము
హర్షము ముప్పిరి కొనగా
చరచర చకచక నడచుచు
చేరె ద్వారకానగరికి

అన్ని మార్గములను గడిచి
అన్ని ద్వారములను దాటి
రాజ సౌధమందున వి
రాజ మానుడౌచు వెలుగు

సుందర నంద కిశోరుని
మందహాస మృదు వదనుని
శిఖి పింఛ మనోభిరాము
వికచాంభోరుహ నేత్రుని
నీలజలధర శ్యాముని
నిఖిల లోక పావనుని
శ్రీకృష్ణుని యదుసింహుని
చిన్ననాటి తన మిత్రుని
సాశ్రునయను డౌచుగాంచె
సానందముగ కుచేలుడు

తనను జూడ వచ్చినట్టి
తన నెచ్చెలి కుచేలుగని
ఆనందంబుప్పొంగగ
ఆ నంద కుమారుడపుడు

పరుగున తన తల్పముడిగి
ప్రాణ సఖున కెదురుపోయి
ప్రియమారగ కౌగలించి
నయముగ లోనికి తెచ్చెను

మంజులమై మనోజ్ఞమై
రంజిలు తన తల్పము పై
కృష్ణుడు సమాదరమ్ముగ
కుచేలు నాసీను జేసె

సతులెల్లరు సంభ్రమున
సాలోచనలై జూడగ
చెదరని చిరునగవొప్పగ
సుదతుల గాంచెను కృష్ణుడు

సరగునరుక్మిణి తెచ్చెను
స్వర్ణ పాత్రమున జలములు
పరుగున సత్యయు తెచ్చెను
బంగరు పళ్ళెర మొక్కటి

కృష్ణుడపుడు సంతసమున
కుచేలు పాదములు కడిగి
హర్షమ్మున తజ్జలముల
శీర్షమ్మున జల్లుకొనెను

మెడలో సుమమాల వేసి
మేన చందనంబలంది
తాంబూలము దక్షిణలిడి
తాల వృంతమున వీచెను



ప్రాణ సఖుడు కృష్ణుడిట్లు
పరమాదర మొనరింపగ
పరమహర్షముప్పొంగగ
పరవశించె కుచేలుండు

ఆ పవిత్ర స్నేహమునకు
ఆ విప్రుని భాగ్యమునకు
కనుచుండిన వారికెల్ల
కన్నులు చెమరించెనపుడు

అటు పిమ్మట శ్రీకృష్ణుడు
అనుంగు సఖులతోడ గూడి
చిన్న నాటి విషయములను
మన్ననతో మాటలాడె

సాందీపని మహర్షికడ
చదువుకొనెడి దినములలో
జరిగినట్టి సంఘటనల
స్మరించుకొని సంతసించె

మధుసూదను డీ విధముగ
మధురాలాపమ్ములాడి
ఆర్ద్రమ్మగుహృదయముతో
అనియెనిట్లు కుచేలుతో –

“ప్రియమిత్రమ! నా కొరకై
ప్రేమగ కొనితెచ్చితేమి
తినుటకు నాకేదియైన
తెచ్చియుందు వనుకొందును”

అని కృష్ణుండడిగి నంత
అవని సురుడు సిగ్గు పడుచు
అటుకుల సంగతి చెప్పక
అధోముఖుండయి కూర్చొనె

అంతట నా యదుసింహుడు
అంతయు నెరిగిన వాడై
ఓ చెలికాడా! అదేమి
దాచుకొందు వావైపున!

నాకొరకై తెచ్చినట్టి
ఆ కానుక నాకునిమ్ము
అని పలుకుచు ప్రేమ మీర
అటుకుల మూటను విప్పెను

మూట విప్పి అటుకుల గని
మోదమ్ముగ శ్రీకృష్ణుడు
పిడికెడు అటుకుల గైకొని
ప్రేమతోడ ఆరగించె

మరొక్క గుప్పెడు తినుటకు
మురహరుండు కౌతుకపడ
వారిజాక్షు కరము పట్టి
వారించెను రుక్మిణి సతి

ఆ విప్రుండా రాత్రికి
గోవిందుని తోడ గూడి
విందు భోజనమ్ము చేసి
విశ్రమించె మై మరిచి



మరునాడుదయమ్మొ లేచి
సరగున కాల్యముల దీర్చి
ప్రాణ సఖుడు వీడుకొల్ప
పయనమయ్యె తన వీటికి

మార్గమ్మున కృష్ణ స్నేహ
మాధుర్యము తల పోయుచు
ఆ నందకుమారు ప్రేమ
కానందమ్మున చొక్కుచు

ప్రాణ మిత్రుప్రణయమునకు
పరవశమ్ముతో నడుచుచు
సంతసముగ సంతృప్తిగ
స్వంత గృహము చేరబోయె

తన కుటీరముల నెలవున
ఘన సౌధమ్ములను గాంచి
విప్రుడు కుచేలుడప్పుడు
విస్మయమ్మునందుచుండ

అంతలోనె అతని పత్ని
అపర లక్ష్మి వోలె వచ్చి
ఇంపుమీద తన వల్లభు
గొంపోయెను సౌధమునకు

కుచేలుడా చిత్రములకు
అచేతనుండయ్యు తొలుత
అది అంతయు శ్రీకృష్ణుని
అనుగ్రహముగా నెంచెను

అటుకులొక్క పిడికెడు తిని
అఖండ వైభవములిడిన
పరమ పురుషు నెమ్మనమున
పరమ భక్తి సంస్తుతించె

కష్టమ్ముల నెల్లబాపి
అష్టైశ్వర్యముల నిడిన
దయామయుడు శ్రీకృష్ణుని
ధ్యానించెను చిత్తమ్మున

భోగమ్ములనెల్లపొంది
భోగలంపటుండు కాక
విరాగియై కుచేలుడు
విష్ణు భక్తుడై వరలెను

శ్రీకృష్ణుని చెలికాడై
శ్రీ కైవల్యమునందిన
ఇది భక్త కుచేలు గాథ
ఇది భాగవత కథాసుధ

* * *



# 9. నరకాసుర వధ

నిఖిలపురాణేతి హాస
నిర్జరకుజ! శుక మునివర!
కరుణ తోడ వినిపింపుమ
నరకాసుర వధ యను కథ!

అని యడిగిన పరీక్షితుని
గని శుకుండు పలికెనిట్లు!

అసురాధిపుడగు నరకుం
డమరావతి నాక్రమించి
అదితి కర్ణ కుండలముల
నపహరించుకొని పోయెను!

అమరేంద్రుడు హరిని జేరి
ఆ వృత్తాంతము దెలుపగ
నరకుని పరిమార్పగ హరి
గరుడునెక్కి బయలుదేరె!

సమరము కేగెడు పతిగని
సత్యభామ పలికెనిట్లు!

ప్రాణనాథ! రణమున నీ
ప్రావీణ్యము జూడనెంతు
ఆహవ భూమికి నీతో
అనుమతింపుమయ్య నన్ను!

ప్రాణప్రియ పలుకులు విని
పలికెనిట్లు హరి నవ్వుచు!

కలహమనగ ప్రియభామిని!
కలహంసల కొలను గాదు
రణమనగా రమణీమణి
రాచిలుకల నెలవు గాదు!

మదగజ ఘీంకారమ్ములు
గదాఘాత నిస్వనములు
కరవాలమ్ముల వ్రేటులు
శరజాలమ్ముల వృష్టులు!

భీషణమగు హయహేషలు
భీకరమగు రణ ఘోషలు
బాలా! భండనమనగా
లీలావన విహారమా!

అని పలికిన నాథుని గని
అనియె నిట్లు సాత్రాజితి!

నాథా! నీ చెంత నుండ
నాకే చింతయు నుండదు
స్వామీ! నీ రక్షణ లో
ఏమి హాని కలుగు నాకు!

నీతో నేనరుదెంచెద
నీరజాక్ష! కాదనకుము
అనుచు సత్య శ్రీకృష్ణుని
అంఘ్రి కమలముల వ్రాలెను!



మందహాసవదనుడగుచు
నందనందనుండప్పుడు
అనుంగు సతి మనోరథము
కంగీకారమ్ము దెలిపె!

నరకాసురు వధియింపగ
గరుడ వాహనమ్ము నెక్కి
సాత్రాజితి వెంట రాగ
సమర భూమి కరుదెంచెను!

నరకుని సైన్యాధీశుడు
మురదానవుడేర్పరచెను
ప్రాగ్జ్యోతిష పురము చుట్టు
పాశమ్ముల రక్షణగా!

మురదనుజుడు పన్నిన పటు
తరపాశమ్ముల నెల్లను
హరి చక్రాయుధము చేత
నవలీలగ ద్రుంచి వేసె!

నిదురనున్న మురాసురుడు
నిదుర లేచి యావులించి
అరుదెంచెను సరాసరిగ
ఆహవ భూమికినప్పుడు!

హరి! హరి! నిలుమనుచును గద
మురదనుజుడు విసరె నంత
ముర! ముర! నిను చంపెదనని
హరి చక్రము వదలెనపుడు!

హరి సుదర్శనాయుధమ్ము
మురదనుజుని తలద్రుంచెను
హరి నుతింపబడె నంతట
మురహరుడను నామమ్మున!

మురదనుజుడు సమసినంత
హరితో సమరము చేయగ
వరకుండల భూషితుడై
నరకుండరుదెంచెనపుడు!

సరాసరిగ నరకుడపుడు
సమరభూమి కరుదెంచెను
సంగరాంగణమున గాంచె
సత్యతోడ శ్రీకృష్ణుని!

సత్యభామ నరకుని గని
సమరమునకు సిద్ధపడెను

కొప్పును గట్టిగ బిగించె
కోక గట్టిగా గట్టెను
కోదండము చేత బట్టి
కోమలి రణమునకు వచ్చె

సత్యను గని శ్రీకృష్ణుడు
సరసమ్ముగ పలికెనిట్లు
లేమా! దనుజులగెలువగ
లేమా! నీకేల శ్రమ!

చిరు నువ్వులతో పలికిన
శ్రీకృష్ణుని మాటలు విని
వీరాంగనయగుచు సత్య
వింటిని చేత ధరించెను!



నారీ మణి వెనువెంటనె
నారి బిగించెను ధనువుకు
అరుల గుండెలదరునట్లు
అల్లె త్రాడు మ్రోగించెను!

ఆమెలోన పొంగి పొరలె
అంగారము శృంగారము
అరులకు చెమటలు పట్టగ
మురహరునకు ముచ్చటయ్యె!

బొమ్మల పెండ్లిండ్లకైన
పోనొల్లని సత్యభామ
మగవారిని గనిన చాలు
మరుగున దాగెడు అబల
ఆహవరంగమున నెట్లు
అడుగు మోపెనో కదా!

వీణ పట్టలేని మగువ
బాణాసన మెట్లు పట్టె
సరములల్ల లేని కొమ్మ
శరములెట్లు సంధించెను!

అనుచు మిగుల అచ్చెరువుగ
హరి విస్మయమున కనంగ
నరకాసురు పైన సత్య
కురిపించెను అంప వాన!

అప్పుడామె ముఖము తోచె
హరికి పూర్ణచంద్ర బింబమువలె
ధూర్త దానవునకు తోచె
మార్తాండుని బింబమ్ముగ!

ముద్దరాలి బాణ వృష్టి
మోదముఖేదము గూర్చెను
శృంగారము వీరమ్మును
పొంగెనొక్క సారిగనే!

కొంత తడవు ఇంతి తీరు
వింతగ జూచిన శ్రీహరి
మధురసుధారసము లొలుక
మానినితో పలికె నిట్లు!

కొమ్మా! యుద్ధము చాలును
కొమ్ములు విరిగెను అసురున
కనుచు ధనుర్బాణములను
గొనియె సత్య కరమునుండి!

కురిపించెను బాణ వృష్టి
హరి నరకాసురుని పైన
ప్రయోగించెనొక శతఘ్ని
పార ద్రోలె సైన్యములను!

నరకుడు మత్తేభమెక్కి
హరిపై విసరెను శూలము
మురహరుండు చక్రముతో
ముక్కలు చేసెను దానిని!

హరి చక్రాయుధము తోడ
నరకుని తల ఖండించెను
కుండల మండితమగు తల
కుంభిని పై పడియెనపుడు!



హరిపై కురిపించిరపుడు
సురలు మునులు విరుల వాన
భూదేవియు మోదమ్మున
భూరి కానుకలు నిచ్చెను!

ఇది నరకాసుర వధ కథ
సదమల భాగవత సుధ!
సరస సుందరం బైనది
సత్యా శ్రీకృష్ణుల కథ!

* * *



# 10. అంబరీషుని కథ

అంబరీషుడను భూవరు
డతి పవిత్ర చరిత్రుడు
అతుల వైభవమ్ముతోడ
అలరారుచు నుండెనతడు

హరిభక్తుల యందతండు
అగ్రగణ్యుడై వరలుచు
శ్రీహరిని నిరంతరమ్ము
సేవించుచునుండెను

అతని చిత్త మనవతరము
హరి యందే నిలచియుండు
అతని రసన అను క్షణమ్ము
హరి జపమ్మె చేయుచుండు

వినుచు నుండు నతడెప్పుడు
విష్ణుని కళ్యాణ కథలు
కనుచు నుండు నెల్లప్పుడు
కమలాక్షుని కన్నులార

ఆతని జ్ఞానేంద్రియములు
ఆతని కర్మేంద్రియములు
అకలంకమ్ముగ శ్రీహరి
కంకితమై పోయెను



సరస్వతీ నదితటమున
సలిపెనతడు సత్క్రతువులు
వందలు వేలుగ సతతము
వసిష్ఠాది ఋషుల గూడి

తన సంపదలన్నింటిని
దాన ధర్మములుగ నిచ్చి
రాజిల్లెను రాజర్షిగ
రాజు అంబరీషుడిలను

క్రమముగ నా రాజర్షికి
కామితములు నశియించగ
నిర్మోహత్త్వమును పొంది
నిస్సంగుండత డయ్యెను

ఏకాంతంబున నెప్పుడు
శ్రీకాంతుని ధ్యానించుచు
అమల భక్తి పరవశుడై
ఐహికముల మరచి పోయె

అంబురుహాక్షుడు శ్రీహరి
అంబరీషు భక్తికలరి
దర్శనమిడి తన ఘన, సు
దర్శనమును ప్రసాదించె
అది మొదలుగ సుదర్శనము
అంబరీషు రక్షయయ్యె

అంబరీషుడటు పిమ్మట
అర్ధాంగీ సహితుండై
ద్వాదశ మాసముల పాటు
ద్వాదశి వ్రతమ్ము చేసె

సంవత్సర మీ రీతిగ
సకల నియమ నిష్ఠలతో
అంబరీషుడతి భక్తిని
ఆచరించె ఆ వ్రతమును

కార్తిక మాసమునందున
కాళిందిని స్నానమాడి
మధువనమున మధురిపునకు
మహాభిషేకమ్ము చేసె

సకల విధి విధానమ్ముగ
సరసిజాక్షు పూజించెను
ధేనువులననంతమ్ముగ
దానమిడెను భూసురులకు

తనియె జేసె విప్రజనుల
ఘనమగు భోజనములతో
ద్వాదశి పారణ సేయగ
తానుద్యుక్తుండయ్యె రాజు

ఆ సమయమ్మున నచటకు
భాసుర తపోవిలాసుడు
అఖండ యోగాభ్యాసుడు
అరుదెంచెను దుర్వాసుడు

అమ్మునివర్యుని గాంచిన
అంబరీషు డాదరముగ
స్వాగత సత్కారములిడి
సాంజలియై పలికెనిట్లు



ధన్యుడనైతిని మునివర!
తమరి రాకవలన నేడు
దయతో మా ఇంట తమరు
చేయవలయు భోజనమ్ము

అంబరీషు వినయమ్మున
కలరినట్టి దుర్వాసుడు
ఆహారంబారగింప
అంగీకారమ్ము తెలిపె

స్నాన సంధ్య లొనరింపగ
సరగున కాళింది కేగె
స్నానాదుల పూర్తి చేసి
ధ్యానమ్మున మునిగెను ముని

ధరాధిపుడు మునిరాకకు
నిరీక్షించి నిరీక్షించి
ద్వాదశి పారణ సమయము
దాటిపోవు నంచు నెంచి
ధరామరుల నడిగె నపుడు
ధర్మము తెలుపుడటంచును

సలిల భక్షణమ్ము ధర్మ
సమ్మతమని వారు తెల్ప
నీరజాక్షు మదిని నిల్పి
నీరమ్ములుగ్రోలె రాజు

అంత కొంత తడువు చనగ
అరుదెంచెను దుర్వాసుడు
సర్వమ్మును దివ్య తపో
శక్తి చేత తెలిసికొనెను

అమిత క్రోధ పరవశుడై
అదరుచుండ కను బొమ్మలు
అంబరీషు గాంచి మిగుల
ఆగ్రహముగ పలికెనట్లు

దుర్మదాంధుడగుచు రాజు
ధర్మమ్మును తప్పినాడు
విందుకు నను రమ్మని తను
ముందుగనే జలము గ్రోలె

విష్ణుభక్తుడనని తాను
విర్రవీగుచున్నవాడు
ఇప్పుడె నాశక్తి చూపి
చెప్పెద గుణపాఠమ్మును

అనిపల్కుచు దుర్వాసుడు
ఆగ్రహమ్ము పట్టలేక
శిరమునుండి జటను పెరకి
సృజియించెను 'కృత్య' నొకటి

ప్రళయ కాలజ్వాల పగిది
భయంకరాకృతిని గలిగి
శూలమొకటి పట్టి కృత్య
వాలెను భూపాలు నెదుట
భక్తవత్సలుడు శ్రీహరి
భక్తుని ఆపదను గాంచి
తన సుదర్శనమును పంపె
ముని కృత్యను సంహరింప



చక్రానల జ్వాలలలో
క్షణములోన కృత్యమడిసె
దుర్వార సుదర్శనమ్ము
దుర్వాసుని వెంట పడెను

ప్రాణభీతితో తపస్వి
పరువులెత్త పలు దిశలకు
విడువక ముని వెంట పడెను
విష్ణు చక్ర మాగకుండ

దివికేగిన దివికేగెను
భువి వ్రాలిన భువికి వ్రాలె
హరిచక్రము వెంటపడగ
పరువులెత్త సాగెను ముని

పరువులెత్తి దుర్వాసుడు
బ్రహ్మదేవు నాశ్రయించె
చక్రమ్మును నివారించి
సంరక్షింపగ వేడెను

దుర్వాసుని మొరాలించి
పలికెనిట్లు ఆ విరించి
విశ్వమెల్ల మనుచున్నది
విష్ణుదేవు మహిమ వలన
విష్ణు చక్రమడ్డు కొనగ
వేరెవరికి సాధ్యపడును
హరిచక్రము నివారింప
అసాధ్యమ్ముసుమీ నాకు

కమలభవుని పలుకులువిని
కైలాసము కేగెను ముని
పరమ శివా కావుమనుచు
పాదమ్ముల మీద వ్రాలె

శంకరుండు మునిని గాంచి
శంకలేక పలికెనిట్లు
దుర్వాసా హరిచక్రము
దుర్వారమ్మన్యులకు

దీనిని వారింపగలడు
దేవ దేవుడగు హరియే
శరణు వేడవయ్య హరిని
కరుణ గలిగి నిను బ్రోచును

శ్రీకంఠుని మాటలు విని
వైకుంఠము కేగెను ముని
ఆ సమయమ్మున శ్రీహరి
శ్రీసతితో గూడి యుండె
నర్మ భాషణమ్ములతో
నవ్వుచు క్రీడించు చుండె

దుర్వాసుండచటి కేగి
సర్వేశా కరుణానిధి!
శరణు శరణు బ్రోవుమనుచు
చరణమ్ముల మ్రోల వాలె!

శ్రీహరి దుర్వాసుని గని
చిరునవ్వుల పలికెనిట్లు
పరమ రుషీ నేనెప్పుడు
భక్త పరాధీనుండను



గోవు వెంట కోడె పగిది
పోవుచుందు వారి నంటి
వారి కాపదలు వచ్చిన
వారింతును నిరంతరము
వారికి కీడొనరించిన
వారిని నే దండింతును
విప్రోత్తమ! నిన్నిప్పుడు
వేరెవ్వరు రక్షింతురు
ఆశ్రయింపు మంబరీషు
అతడె నిన్ను బ్రోవగలడు

అని శ్రీహరి ఆనతీయ
ఆ క్షణమే దుర్వాసుడు
అంబరీషు నాశ్రయించి
ఆతని చరణముల వ్రాలె

పాదమ్ముల వ్రాలినట్టి
పరమర్షిని లేవనెత్తి
స్తుతియించెను పలు విధముల
సుదర్శనమ్మును భూపతి

అంబరీషు ప్రార్థనలకు
అలరినట్టి సుదర్శనము
తన ప్రళయానల తేజము
తగ్గించుక వెను తిరిగెను

ప్రాణాపాయమ్ము తప్ప
బ్రతుకుజీవుడా యనుకొని
అంబరీషు పొగడెనిట్లు
హర్షమ్ముగ దుర్వాసుడు

అంబరీష నీ చరితము
అతి పవిత్రమద్భుతమ్ము
నిను బోలెడు హరి భక్తులు
నిజము లేరు వేరెవ్వరు

మదినుంచక నా దోషము
మన్నించితి నను గాచితి
మాన్య చరిత నీ చరితము
మనునిక ఆచంద్రార్కము

ఆ దుర్వాసుండీ గతి
ఆశీర్వచనములు పలుక
అంబరీషుడతి భక్తిని
అమ్మని పదములకు మ్రొక్కె
మృష్టాన్నముల బెట్టియు
మోదముగా వీడుగొలిపె

అంబరీషుడటు పిమ్మట
హరి పూజా వ్రతములతో
చిరకాలము రాజ్యమేలి
చిరయశమ్ము గడియించెను

హరిభక్తుండంబరీషు
డతి పావన చరిత్రుడై
ప్రహ్లాదాదులను బోలి
పరమ భక్తుడై వరలెను

హరిసేవా పరతంత్రుడు
అంబరీషు చరితంబిది
భాగవతోత్తము కథ యిది
భాగవత కథా సుధ యిది.

* * *